epaper.samayamdaily.net

APTEL/26/A3949

S TV SAMAYAM

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 110 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 1 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

నింగిలో మరో విజయం

- జీఎస్ఎల్వీ-ఎఫ్18 ప్రయోగం
- ఇస్రోకు మోదీ ప్రశంసలు
- నిర్దేశిత కక్ష్యలోకి ఎన్వీఎస్-03 నావిగేషన్ ఉపగ్రహం
- శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు ప్రధాని అభినందనలు

4

తరగతి గదిలో రక్తపాతం

- పదో విద్యార్థినిపై విద్యుత్ రంపంతో దాడి!
- ముఖం, తల, వీపుపై తీవ్ర గాయాలు..
- అడ్డుకున్న మరో విద్యార్థినికీ గాయాలు
- గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్టు
- బాధితురాలి తల్లికి సీఎం చంద్రబాబు ఫోన్.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- ఘటనపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన..
- ఆసుపత్రిలో పరామర్శించిన పరిటాల సునీత
- బాలిక ప్రాణరక్షణకు మంత్రి లోకేశ్ చొరవ..

2

ఏపీకి మరో తుఫాను ముప్పు

నవంబర్ 2 నుంచి భారీ వర్షాలు!

అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు..

ముందస్తు చర్యలకు ఆదేశాలు

ఆర్నబ్ తుఫాను సృష్టించిన విధ్వంసం నుంచి రాష్ట్రం కోలుకుంటున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌కు మరో తుఫాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడిన నేపథ్యంలో సీఎంచంద్రబాబు వాతావరణ పరిస్థితులు, తుఫాను ప్రభావం, పునరుద్ధరణ పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 2

తుఫాన్ బాధితుల సహాయానికి

ఎస్‌బీఐ 5 కోట్ల విరాళం

ఎస్‌బీఐ ప్రతినిధులకు చంద్రబాబు కృతజ్ఞతలు 2

నేడే పురపోరు

- పోలింగ్ కేంద్రాలన్నీ నిఘా నీడలో!
- ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం
- 36,351 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు
- సీసీ కెమెరాలు, వెబ్ ప్రసారాలతో ప్రత్యేక నిఘా
- సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బలగాలు
- 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్
- నవంబర్ 3న ఓట్ల లెక్కింపు.. ఫలితాల వెల్లడి

అమరావతి, అక్టోబర్ 31 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక ఎన్నికల సమరానికి రంగం సిద్ధమైంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్ ప్రసారాలు, వీడియో చిత్రీకరణ వంటి పర్యవేక్షణ చర్యలు చేపట్టింది. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించింది. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పిలుపునిచ్చారు.

వివరాలు 2 లో

ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సర్వం సిద్ధం చేసింది. పట్టణ ప్రాంతాల్లో ఎన్నికలను అత్యంత స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ పునేఠా వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కెమెరాల నిఘా పరిధిలోకి తీసుకొచ్చామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా వచ్చి తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

3

2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్!

డిసెంబర్ 31, 2029 లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ కార్యాచరణ

'ఐక్యతా పరుగు' ప్రారంభించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా

అర్ధశతాబ్దపు ప్రస్థానం

- భారత మహిళల తొలి టెస్టుకు నేటితో 50 ఏళ్లు
- 1976 అక్టోబర్ 31న వెస్టిండీస్‌తో చారిత్రక అరంగేట్రం
- తొలి మ్యాచ్‌లోనే ఐదు వికెట్లతో మెరిసిన శుభాంగి కులకర్ణి
- అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి సిక్సర్ బాదిన శాంతా రంగస్వామి
- ఐదు దశాబ్దాల మహిళా క్రికెట్ ప్రయాణాన్ని గుర్తుచేసిన బీసీసీఐ

7

పోలీస్ కార్యాలయంలోనే బాలికపై లైంగికదాడి

- సహాయం కోరిన బాలికపై పోలీస్ అధికారి అఘాయిత్యం
- అరాచకానికి మహిళా ఉద్యోగిని సహకారం దారుణం

4

జ్ఞానేశ్‌పై 'ప్రజా అభిశంసన'

- ప్రతిపక్షాల ప్రత్యామ్నాయ పార్లమెంట్!
- ఢిల్లీలో ఇండియా కూటమి వినూత్న నిరసన కార్యక్రమం
- ఖర్గే నివాసంలో మాక్ పార్లమెంట్
- సభాపతిగా మాజీ స్పీకర్ మీరా
- జ్ఞానేశ్ కుమార్‌పై తీర్మానం ప్రవేశపెట్టిన మల్లికార్జున ఖర్గే
- సోనియా, రాహుల్ సహా ప్రతిపక్ష అగ్రనేతల హాజరు
- ఓటర్ల జాబితా సవరణపై తీవ్ర ఆరోపణలు.. బీజేపీ ఎదురుదాడి

4

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది

- రాప్తాడు ఘటనే నిదర్శనం
- వైఎస్ జగన్ తీవ్ర ధ్వజం!
- పాఠశాలల్లో పిల్లలకు భద్రత కల్పించలేని పరిస్థితి నెలకొందని విమర్శ
- రాజకీయ కక్ష సాధింపులకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపణ

3



మరో తుఫాను ముప్పు

నవంబర్ 2 నుంచి భారీ వర్షాలు!

అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు..

అమరావతి, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : అర్నబ్ తుఫాను సృష్టించిన విధ్వంసం నుంచి రాష్ట్రం కోలుకుంటున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌కు మరో తుఫాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాతావరణ పరిస్థితులు, తుఫాను ప్రభావం, పునరుద్ధరణ పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో వాతావరణ పరిస్థితులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం ఏర్పడిన వాయుగుండం రేపటికి తుఫానుగా బలపడే అవకాశాలున్నాయని వెల్లడించారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్రలో గుంటూరు నుంచి దక్షిణ దిశలోని దిగువ ప్రాంతాలు, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. నవంబర్ 2, 3, 4 తేదీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్ల సహాయంతో తుఫాను కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, దాని గమనాన్ని ముందుగానే అంచనా వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన సహాయక చర్యలు, ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, విద్యుత్, విపత్తుల నిర్వహణ శాఖల అధికారులు, వివిధ టెలికాం ఆపరేటర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితుల సహాయానికి ఎస్‌బీఐ రూ.5.01 కోట్ల విరాళం

ఎస్‌బీఐ ప్రతినిధులకు చంద్రబాబు కృతజ్ఞతలు



అమరావతి, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : అర్నబ్ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలిచేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముందుకొచ్చింది. తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5.01 కోట్ల విరాళాన్ని అందించింది. ఈ మేరకు ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అమర రామ్మోహన్ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేసింది. తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు ఉదారంగా విరాళం అందించిన ఎస్‌బీఐ యాజమాన్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చిన బ్యాంకు ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల్ కుమార్, జనరల్ మేనేజర్ కుందన్ జ్యోతి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ షేక్ షమీన్ భాను తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్ తుపాన్ నష్టాల పరిశీలనకు రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర బృందం

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల బృందం రాక

అమరావతి, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : అర్నబ్ తుపాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ఏడుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం రాష్ట్రానికి చేరుకుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్నారు. కేంద్ర బృందం నేటి నుంచి తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర బృందానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర బృందం ఆర్టీజీఎస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అర్నబ్ తుపాన్ ప్రభావంతో రాష్ట్రంలో జరిగిన నష్టం, దెబ్బతిన్న మౌలిక వసతులు, ఇతర వివరాలను అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. ఆర్టీజీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తుపాన్ నష్టం, సహాయక చర్యలు, పునరుద్ధరణ పనుల వివరాలను వెల్లడించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కేంద్ర బృందం తుపాన్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించి నష్టాన్ని పరిశీలించనుంది. ఈ పర్యటన ద్వారా రాష్ట్రంలో జరిగిన నష్టంపై సమగ్ర అంచనా వేసి కేంద్రానికి నివేదిక సమర్పించనుంది.

తరగతి గదిలో రక్తపాతం

- పదో విద్యార్థినిపై విద్యుత్ రంపంతో దాడి!
- ముఖం, తల, వీపుపై తీవ్ర గాయాలు..
- అడ్డుకున్న మరో విద్యార్థినికి గాయాలు
- గంటల వ్యవధిలోనే నిందితుడి అరెస్టు
- బాధితురాలి తల్లికి సీఎం చంద్రబాబు ఫోన్.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- ఘటనపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన..
- ఆసుపత్రిలో పరామర్శించిన పరిటాల సునీత
- బాలిక ప్రాణరక్షణకు మంత్రి లోకేశ్ చొరవ..

రాప్తాడు, అక్టోబర్ 31 (సమయం న్యూస్): చదువుల తల్లి నిలయంగా ఉండాల్సిన పాఠశాల తరగతి గది ఒక్కసారిగా భయానక ఘటనకు వేదికైంది. ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తుండగా తరగతి గదిలోకి ప్రవేశించిన ఓ యువకుడు పదో తరగతి విద్యార్థినిపై చెట్లు కోసేందుకు ఉపయోగించే విద్యుత్ రంపంతో దాడికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. అనంతపురం జిల్లా రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. తీవ్రంగా గాయపడిన బాలికను తొలుత అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

తరగతి గదిలోకి చొరబడి అమానుష దాడి

పాఠశాలలో యథావిధిగా తరగతులు జరుగుతున్న సమయంలో ఓ యువకుడు విద్యుత్ రంపంతో ప్రాంగణంలోకి ప్రవేశించినట్లు సమాచారం. నేరుగా పదో తరగతి విద్యార్థిని ఉన్న గదిలోకి వెళ్లి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఊహించని పరిణామంతో తరగతి గదిలోని విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బాలికను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినికి కూడా గాయాలయ్యాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు తేరుకునేలోపే నిందితుడు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం అందించి, గాయపడిన విద్యార్థినులను ఆసుపత్రికి తరలించారు.

ఇంత ఘాతుకానికి పాల్పడతాడనుకోలేదు

పాఠశాలలో కొన్ని మరమ్మతు పనులు జరుగుతున్నాయని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. నిందితుడు పాఠశాలలోకి వస్తున్న సమయంలో ఉపాధ్యాయులు గమనించినప్పటికీ మరమ్మతు పనులకు వచ్చిన కార్మికుడిగా భావించారని వివరించారు. ఘటన జరిగిన సమయంలో తరగతి గదిలో ఉపాధ్యాయుడు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడి వయసు సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండవచ్చని అంచనా వేశారు. ఏం జరుగుతుందో గుర్తించేలోపే దాడికి పాల్పడి పారిపోయాడని తెలిపారు. ఈ ఘటన పాఠశాలల్లో బయటి వ్యక్తుల ప్రవేశం, విద్యార్థుల భద్రతపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తింది.

గంటల వ్యవధిలో నిందితుడి అరెస్టు

ఘటన అనంతరం రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ధర్మవరం వైపు వెళ్తున్న సమయంలో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తొలుత సమాచారం వెలువడింది. అనంతరం నిందితుడిని అరెస్టు చేసినట్లు వెల్లడైంది. నిందితుడు బాధిత బాలికకు సమీప బంధువని స్థానికులు చెబుతున్నప్పటికీ, ఈ విషయంపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. దాడికి దారితీసిన కారణాలు, నిందితుడి ఉద్దేశం, ఘటనకు ముందు జరిగిన పరిణామాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

బాధితురాలి తల్లికి సీఎం చంద్రబాబు భరోసా

ఈ దారుణ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తరగతి గదిలోనే విద్యార్థినిపై విద్యుత్ రంపంతో దాడి జరగడం అత్యంత అమానుషమని పేర్కొన్నారు. విషయం తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలిక తల్లికి స్వయంగా ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాలిక ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. దాడిని అడ్డుకునే ప్రయత్నంలో గాయపడిన మరో విద్యార్థినికి కూడా మెరుగైన చికిత్స అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చికిత్సలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలల్లో భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన

రాప్తాడు ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. పాఠశాల తరగతి గదిలోకి చొరబడి విద్యార్థినిపై దాడికి పాల్పడటం అత్యంత దారుణమని ఖండించారు. అనంతపురం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. బాధితురాలికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన పరిటాల సునీత

ఘటన విషయం తెలుసుకున్న వెంటనే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని పేర్కొన్నారు.

బాలిక ప్రాణరక్షణకు మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ

దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికకు అత్యుత్తమ చికిత్స అందించేందుకు రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించాలని నిర్ణయించారు. అక్కడి ఉన్నతస్థాయి వైద్యులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి బాలిక ఆరోగ్య పరిస్థితిని వివరించారు. అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతపురం నుంచి బెంగళూరుకు అంబులెన్స్ వేగంగా చేరుకునేందుకు గ్రీన్ చానల్ ఏర్పాటు చేయాలని కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. బాలిక తరలింపు ప్రక్రియను అధికారులతో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షించారు.

పాఠశాలల భద్రతపై ఆందోళన

రాప్తాడు ఘటనతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత అంశం మరోసారి చర్చనీయాంశమైంది. మరమ్మతు పనులు జరుగుతున్న సమయంలో బయటి వ్యక్తుల రాకపోకలపై పర్యవేక్షణ లేకపోతే ఎలాంటి ప్రమాదాలు తలెత్తవచ్చో ఈ ఘటన గుర్తుచేసింది. ఉపాధ్యాయుడు ఉన్న సమయంలోనే దాడి జరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. పాఠశాలల్లోకి ప్రవేశించే వ్యక్తుల వివరాలను నమోదు చేయడం, సందర్శకుల గుర్తింపును నిర్ధారించడం, విద్యార్థులకు రక్షణ కల్పించడం వంటి చర్యలు అత్యవసరమని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

నేడే పురపోరు..

పోలింగ్ కేంద్రాలన్నీ నిఘా నీడలో!

ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

36,351 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు

- సీసీ కెమెరాలు, వెబ్ ప్రసారాలతో పోలింగ్‌పై ప్రత్యేక నిఘా
- సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు బలగాల మోహరింపు
- పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్
- నవంబర్ 3న ఓట్ల లెక్కింపు..
- ఫలితాల వెల్లడి

అమరావతి, అక్టోబర్ 31 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక ఎన్నికల సమరానికి రంగం సిద్ధమైంది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పోలింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్ ప్రసారాలు, వీడియో చిత్రీకరణ వంటి పర్యవేక్షణ చర్యలు చేపట్టింది. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించింది. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పిలుపునిచ్చారు. పురపాలక ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 36,351 మంది పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించారు. వీరిలో జిల్లా పోలీసు విభాగాల నుంచి 32,276 మంది, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు విభాగం నుంచి 2,730 మంది, ఇతర విభాగాల నుంచి 1,345 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణతోపాటు బ్యాలెట్ పెట్టెల రవాణా, సమస్యాత్మక ప్రాంతాల పర్యవేక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే తక్షణమే స్పందించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచారు. ఎన్నికల విధుల కోసం 1,543 మార్గ పర్యవేక్షణ సంచార బృందాలను ఏర్పాటు చేశారు. వీటితోపాటు అత్యవసర పరిస్థితుల్లో స్పందించే ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఘర్షణలు, బెదిరింపులు, అక్రమాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు సీసీ కెమెరాలు, వెబ్ ప్రసారాల ద్వారా పర్యవేక్షణ ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అవసరమైన చోట వీడియో చిత్రీకరణ, ఇతర సాంకేతిక పద్ధతులను వినియోగించనున్నారు.

పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన దృశ్యాలను భద్రపరిచేందుకు కూడా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఓటింగ్ రహస్యాన్ని కాపాడుతూనే కేంద్రాల వద్ద జరిగే పరిణామాలను పర్యవేక్షించనున్నారు. పురపాలక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను సవరించింది. తొలుత అక్టోబర్ 28న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 1కి మార్చింది. నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులకు తగిన అవకాశాలు కల్పించే అంశంపై న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పలు పురపాలక సంస్థల్లో కొన్ని వార్డులు ఏకగ్రీవమయ్యాయి. అన్ని వార్డుల్లోనూ పోటీ లేకుండా ఎన్నికలు పూర్తయిన పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదు. మిగిలిన వార్డులు, డివిజన్లలో ఓటర్లు తమ ప్రతినిధులను ఎన్నుకోనున్నారు. ఏకగ్రీవ ఎన్నికలు జరిగిన స్థానాల వివరాలను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది.

పోలింగ్ సిబ్బందికి అవసరమైన సామగ్రిని అందించి ఆయా కేంద్రాలకు పంపించే ఏర్పాట్లు చేపట్టారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఎన్నికల సంఘం ఆదేశించింది. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరించనున్నారు. పోలింగ్ అనంతరం అవసరమైతే నవంబర్ 2న తిరిగి పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. మరోవైపు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను నవంబర్ 5కు మార్చారు. ఆ ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 7న జరగనుంది. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరింది. ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు, బెదిరింపులకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించింది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటిస్తూ ప్రశాంత వాతావరణానికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్!

- డిసెంబర్ 31, 2029 లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ కార్యాచరణ
- 'ఐక్యతా పరుగు' ప్రారంభించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్): దేశాన్ని 2029 డిసెంబర్ 31 నాటికి పూర్తిస్థాయిలో మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. యువత భవిష్యత్తును కాపాడటంతోపాటు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి మాదకద్రవ్యాల నిర్మూలన అత్యంత అవసరమని స్పష్టం చేశారు. భారత తొలి ఉప ప్రధానమంత్రి, తొలి హోం మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని శనివారం ఢిల్లీలో నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఐక్యతా పరుగు'ను ప్రారంభించి ప్రసంగించారు. దేశ సమైక్యత కోసం పటేల్ చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ, అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అసాధారణ నాయకత్వాన్ని ప్రదర్శించారని అమిత్ షా కొనియాడారు. భారతదేశ చరిత్రను, భౌగోళిక స్వరూపాన్ని మార్చిన మహనీయుడిగా పటేల్ నిలిచిపోయారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కేవలం 1,218 రోజుల్లోనే దేశ సమైక్యతకు అవసరమైన కీలక కార్యాచరణను పూర్తి చేశారని తెలిపారు. ఎంతోమంది నాయకులు జీవితకాలంలో సాధించలేని గొప్ప కార్యాన్ని పటేల్ తక్కువ సమయంలోనే సాధించారని ప్రశంసించారు. దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను అమిత్ షా ప్రస్తావించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి భారత్ నక్సలిజం నుంచి విముక్తి పొందిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు దేశాన్ని మాదకద్రవ్యాల నుంచి విముక్తి చేయడమే తమ తదుపరి లక్ష్యమని వెల్లడించారు. 2029 డిసెంబర్ 31 నాటికి దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సమాజంలోని అన్ని వర్గాల సహకారం అవసరమని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని అమిత్ షా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలంటే ముందుగా మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలని అన్నారు. ఆరోగ్యవంతమైన యువతతోనే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను అమిత్ షా ఈ సందర్భంగా ప్రస్తావించారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని 370వ అధికరణం రద్దు, నక్సలిజం నిర్మూలనకు చేపట్టిన చర్యలు, దేశవ్యాప్తంగా ఏకీకృత పన్నుల వ్యవస్థ అమలు వంటి నిర్ణయాలను వివరించారు. దేశ సమగ్రతను బలోపేతం చేయడంతోపాటు ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. భారతదేశంలో విభిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నప్పటికీ ప్రజల మధ్య ఐక్యత దేశానికి గొప్ప బలమని అమిత్ షా పేర్కొన్నారు. భిన్నత్వాన్ని బలహీనతగా కాకుండా జాతీయ శక్తిగా చూడాలని సూచించారు. పరస్పర సంభాషణలు, విశ్వాసం, అందరినీ కలుపుకొని వెళ్లే విధానాలతోనే ఉమ్మడి జాతీయ గుర్తింపు ఏర్పడిందని వివరించారు. దేశ సమైక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. సోమనాథ ఆలయ పునర్నిర్మాణాన్ని భారత సాంస్కృతిక, జాతీయ పునరుజ్జీవనానికి ప్రతీకగా అమిత్ షా అభివర్ణించారు. ఆలయ పునర్నిర్మాణానికి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సంకల్పించారని గుర్తుచేశారు. దేశ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో పటేల్ చూపిన దూరదృష్టి ఆదర్శనీయమని పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం కీలకమని అమిత్ షా తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి కార్యక్రమాలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక శక్తుల్లో ఒకటిగా భారత్ ఎదిగేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని వివరించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలకు చాలా సంవత్సరాలపాటు తగిన గుర్తింపు లభించలేదని అమిత్ షా అభిప్రాయపడ్డారు. గుజరాత్‌లో నిర్మించిన ఐక్యతా విగ్రహాన్ని ప్రస్తావిస్తూ, నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాజెక్టును ప్రతిపాదించి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. పటేల్ గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేసేందుకు ఈ విగ్రహం ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో అమిత్ షా జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధూ, కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రులు నిత్యానంద రాయ్, బండి సంజయ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ పోలీస్ బలగాలతో నిర్వహించే కవాతులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గౌరవ వందనం స్వీకరించనున్నట్లు అమిత్ షా తెలిపారు.

పెరిగిన ఇంట్లోనే పెళ్లి చేయాలనుకున్నాం.. ఆ ఆశ తీరడం లేదు!

- కుమార్తె అంజలి వివాహ వేదిక మార్పుపై వైఎస్ షర్మిల భావోద్వేగం
- యలహంక నివాసంలో కాకుండా మరోచోట పెళ్లి వేడుక నిర్వహణ
- వివాదాలకు తావివ్వకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- 'ఆ ఇల్లు నాది, నా పిల్లల హక్కు' అంటూ ఆస్తుల పంపకంపై కీలక వ్యాఖ్యలు
- 'నాన్న వైఎస్సార్ తిరిగిన ఇంట్లో బిడ్డ పెళ్లి చేయాలనుకున్నాం'
- 'నా బిడ్డ కోరిక నెరవేర్చలేకపోతున్నందుకు బాధగా ఉంది'

బెంగళూరు, అక్టోబర్ 31 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహ వేదికను మార్చుతున్నట్లు ప్రకటించారు. బెంగళూరులోని యలహంక నివాసంలో నిర్వహించాలనుకున్న వివాహ వేడుకను మరో ప్రదేశానికి మార్చాలని నిర్ణయించినట్లు శనివారం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. వివాహ వేదిక విషయంలో తలెత్తిన వివాదాలకు దూరంగా ఉండి, కుమార్తె పెళ్లిని ప్రశాంతంగా జరిపించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. తాను పెరిగిన ఇంట్లోనే పెళ్లి చేసుకోవాలన్న కుమార్తె ఆకాంక్షను నెరవేర్చలేకపోతున్నందుకు తల్లిగా ఎంతో బాధపడుతున్నానని షర్మిల భావోద్వేగానికి లోనయ్యారు. యలహంక నివాసం తమ కుటుంబ ఆస్తుల పంపకంలో తనకు, తన పిల్లలకు దక్కిందని పేర్కొంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. యలహంక నివాసం యాజమాన్యంపై నెలకొన్న వివాదం నేపథ్యంలో షర్మిల తన వాదనను స్పష్టంగా వెల్లడించారు. తనకు చెందని ఆస్తిని ఆశించే వ్యక్తిత్వం తనది కాదని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అప్పటివరకు ఉమ్మడి ఆస్తిగా ఉన్న యలహంక నివాసం కుటుంబ ఆస్తుల పంపకంలో భాగంగా పూర్తిగా తనకు, తన పిల్లల వాటాకు వచ్చిందని ఆమె తెలిపారు. ఈ విషయం దేవుడి సాక్షిగా నిజమని పేర్కొన్నారు. ఆ ఇంటిపై తమకు హక్కు ఉందనే నమ్మకంతోనే కుమార్తె వివాహాన్ని అక్కడ నిర్వహించాలని భావించినట్లు వివరించారు. యలహంక నివాసంతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని షర్మిల గుర్తుచేసుకున్నారు. తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తిరిగిన ఇల్లు కావడంతో ఆ నివాసం తమకు ఎంతో ప్రత్యేకమని తెలిపారు. తన కుమార్తె అంజిలి కూడా ఆ ఇంట్లోనే పెరిగిందని, అందుకే అక్కడే వివాహం జరగాలని కోరుకుందని వివరించారు. బిడ్డ పెరిగిన ఇంట్లోనే వివాహం జరిపించడం తల్లిదండ్రులకు గొప్ప సంతోషాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఆ ఆనందాన్ని తన కుమార్తెకు అందించలేకపోతున్నందుకు ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఇంట్లో కుమార్తె వివాహాన్ని నిర్వహించాలన్నది తమ కుటుంబ ఆకాంక్ష అని షర్మిల తెలిపారు. చిన్ననాటి జ్ఞాపకాలతో ముడిపడిన ఇంట్లోనే కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలని అంజిలి ఆశించిందని పేర్కొన్నారు. అయితే వివాహ వేదిక విషయంలో చోటుచేసుకుంటున్న పరిణామాల కారణంగా ఆ కోరికను నెరవేర్చలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తె పరిస్థితిని అర్థం చేసుకుని బాధపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కుమార్తె వివాహం పెద్దలు కుదిర్చిన సంబంధమని షర్మిల వెల్లడించారు. రెండు కుటుంబాల మధ్య సంతోషకర వాతావరణంలో జరగాల్సిన శుభకార్యానికి ఎలాంటి వివాదాలు, గొడవలు అడ్డురాకూడదని భావిస్తున్నట్లు తెలిపారు. వివాహాన్ని ప్రశాంతంగా నిర్వహించడం తల్లిదండ్రులుగా తమ బాధ్యత అని పేర్కొన్నారు. అందుకే యలహంక నివాసంలో పెళ్లి నిర్వహించాలన్న నిర్ణయాన్ని మార్చుకున్నట్లు స్పష్టం చేశారు. వైఎస్ అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డి వివాహాన్ని యలహంక ఇంట్లో కాకుండా మరో ప్రదేశంలో నిర్వహించనున్నట్లు షర్మిల ప్రకటించారు. బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో వివాహ వేడుక జరగనుందని తెలిపారు. అయితే కొత్త వేదిక ఎక్కడన్న విషయాన్ని తన ప్రకటనలో వెల్లడించలేదు. వివాహం ఎలాంటి వివాదాలకు తావులేకుండా సంతోషకర వాతావరణంలో జరగాలన్నదే తమ ఆకాంక్ష అని వివరించారు. కుమార్తె వివాహ వేదిక మార్పుపై స్పందించిన ప్రతి ఒక్కరికీ షర్మిల ధన్యవాదాలు తెలిపారు. అంజిలి, రఘురామ్ రెడ్డి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కాబోయే నవదంపతులకు తెలుగు ప్రజల ఆశీస్సులు, దీవెనలు ఉండాలని కోరుకున్నారు. కుటుంబంలో చోటుచేసుకున్న పరిణామాలను పక్కనపెట్టి వివాహాన్ని ఆనందంగా నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఆమె ప్రకటన ద్వారా స్పష్టమైంది. యలహంక నివాసంపై షర్మిల చేసిన వ్యాఖ్యలు వైఎస్ కుటుంబ ఆస్తుల పంపకం అంశాన్ని మరోసారి చర్చకు తీసుకొచ్చాయి. ఆ నివాసం పూర్తిగా తనకు, తన పిల్లలకు దక్కిందన్నది షర్మిల వెల్లడించిన వాదన. ఈ అంశంపై సంబంధిత ఆస్తి పత్రాలు, ఇతర పక్షాల స్పందన ఆధారంగా మాత్రమే యాజమాన్యంపై తుది నిర్ధారణకు రావాల్సి ఉంటుంది. అయితే కుటుంబ ఆస్తుల వివాదాన్ని కుమార్తె వివాహ వేడుకకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతోనే వేదిక మార్చినట్లు షర్మిల స్పష్టం చేశారు.

490 మందికి కేంద్ర హోంమంత్రి దక్షత పతకాలు

అత్యుత్తమ సేవలకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా పోలీసు, భద్రతా విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన 490 మంది సిబ్బందికి 2026 సంవత్సరానికి సంబంధించి 'కేంద్ర గృహమంత్రి దక్షత పతకం' ప్రకటించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర పోలీసు సంస్థలకు చెందిన సిబ్బంది ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ, విశిష్ట దర్యాప్తు నైపుణ్యం, నిఘా కార్యకలాపాలు, భద్రతా సేవలు, నేరపరిశోధన శాస్త్ర రంగాల్లో కనబరిచిన నైపుణ్యానికి గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. పోలీసు, భద్రతా వ్యవస్థల్లో విధులు నిర్వర్తిస్తూ ప్రత్యేక ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ప్రధాన ఉద్దేశం. క్లిష్టమైన కేసుల దర్యాప్తు, కీలక నిఘా సమాచారం సేకరణ, భద్రతా కార్యకలాపాల నిర్వహణ, నేరపరిశోధనలో శాస్త్రీయ ఆధారాల విశ్లేషణ వంటి విభాగాల్లో విశేష సేవలందించిన వారిని ఈ పతకాలకు ఎంపిక చేస్తారు. దేశ తొలి ఉప ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది అక్టోబర్ 31న ఈ పతకాలను ప్రకటిస్తారు. జాతీయ ఐక్యత, అంతర్గత భద్రత పరిరక్షణలో పోలీసు వ్యవస్థ పాత్రను గుర్తిస్తూ ఈ పురస్కారాలను అందజేస్తారు. రాష్ట్ర పోలీసు విభాగాలతోపాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర పోలీసు సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రతిభను జాతీయ స్థాయిలో గుర్తించడం ఈ పతకాల ప్రత్యేకత. విధి నిర్వహణలో నిబద్ధత, వృత్తిపరమైన నైపుణ్యం, సమర్థతను ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు దోహదపడతాయి. ఈ ఏడాది మొత్తం 490 మంది ఎంపిక కావడం విశేషం.

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది..

రాప్తాడు ఘటనే నిదర్శనం

వైఎస్ జగన్ తీవ్ర ధ్వజం!

అమరావతి, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన కిరాతక దాడి ఘటన, టీడీపీ కూటమి పాలనలో నెలకొన్న అరాచక పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదిలోనే ఒక విద్యార్థినిపై రంపంతో జరిగిన కిరాతక దాడి, టీడీపీ కూటమి పాలనలో శాంతిభద్రతలు ఎంతగా విఫలమయ్యాయో స్పష్టం చేస్తోందని జగన్ పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ పాఠశాలలోకి దుండగుడు స్వేచ్ఛగా ఎలా ప్రవేశించి ఒక బాలికపై ఇంత దారుణంగా దాడి చేయగలిగాడని ప్రశ్నిస్తూ, విద్యాసంస్థల్లో కూడా పిల్లలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజాపాలనను పక్కనపెట్టి రాజకీయ కక్ష సాధింపులు, 'రెడ్ బుక్' పాలనకే ప్రాధాన్యం ఇస్తోందని, దీనివల్లే నేరస్థులు చట్టమంటే భయం లేకుండా రెచ్చిపోతున్నారని వైఎస్ జగన్ తీవ్రంగా ఆక్షేపించారు. గాయపడిన విద్యార్థినులకు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి కుటుంబాలకు ప్రభుత్వం ధైర్యం చెప్పాలని డిమాండ్ చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి పారదర్శక విచారణ ద్వారా కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలపై తక్షణమే సమీక్ష జరపాలని, ఈ దారుణ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు, బాధితురాలి తల్లితో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం సంపూర్ణంగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడిని పట్టుకుని చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. నారా లోకేశ్ కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించి బాధితురాలికి మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. బాధితురాలికి అత్యవసర వైద్య సేవలు అందిస్తుండగా, పోలీసులు ప్రత్యేక బృందాలతో విస్తృత స్థాయి దర్యాప్తు జరుపుతున్నారు.

జగన్ ఆస్తుల కేసు విచారణ ముమ్మరం..

45 డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తి

డిశ్చార్జి పిటిషన్లపై దూకుడుగా విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : వైసీపీ అధినేత జగన్ ఆస్తుల కేసుల విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ కేసుల విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఇండియా సిమెంట్స్‌కు సంబంధించిన ఛార్జిషీట్‌లో దాఖలైన డిశ్చార్జి పిటిషన్లపై వాదనలు ముగిశాయి. అనంతరం, భారతీ సిమెంట్స్ కేసుకు సంబంధించిన పిటిషన్లపై విచారణను న్యాయస్థానం ప్రారంభించింది. దశాబ్ద కాలంగా ఈ కేసులు విచారణ దశలోనే నిలిచిపోయాయని, వీటిని వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో విచారణ ప్రక్రియ వేగమందుకుంది. హైకోర్టు ఆదేశాలతో సీబీఐ, ఈడీ కేసులపై న్యాయస్థానం రోజువారీ విచారణ చేపడుతోంది. ఇప్పటివరకు ఆరు సీబీఐ ఛార్జిషీట్లకు సంబంధించి మొత్తం 45 డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయింది. జగన్‌తో పాటు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మోపిదేవి వెంకటరమణ, పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, అయోధ్యరామిరెడ్డి వంటి పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. విచారణ పూర్తయిన ఈ 45 డిశ్చార్జి పిటిషన్లపై సీబీఐ కోర్టు ఒకేసారి తన ఆదేశాలను వెలువరించనుంది. దీంతో ఈ కేసుల భవిష్యత్తుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

రాప్తాడు బాధిత విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండ

బాధిత తల్లితో మాట్లాడిన హోంమంత్రి అనిత!

అమరావతి, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి చేసిన దారుణ ఘటనను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా ఖండించారు. ఈ దురదృష్టకర ఘటనపై తక్షణమే స్పందించిన ఆమె, బాధిత విద్యార్థిని తల్లితో ఫోనులో మాట్లాడి ఓదార్చారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని, బాధిత విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా సంపూర్ణంగా అండగా ఉంటుందని స్పష్టమైన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. పాఠశాలలో ప్రశాంతంగా చదువుకుంటున్న పదో తరగతి బాలికపై ఇలాంటి దాడి జరగడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. బాధిత విద్యార్థినికి అత్యుత్తమ వైద్యం అందించి, ఆమె త్వరగా కోలుకునేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా ఎస్పీతో స్వయంగా మాట్లాడి కేసు విచారణ, భద్రతా చర్యలపై దిశా నిర్దేశం చేసినట్లు వెల్లడించారు. విద్యార్థిని త్వరగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు.

సంపాదకీయం

యుద్ధానికి ఖర్చులేదట

చమురుతో లెక్క సరిపోయిందట!

వెనెజువెలా చమురుతో ఇరాన్ యుద్ధ వ్యయం భర్తీ చేశామన్న ట్రంప్

ప్రాణనష్టానికి వెల కట్టేదెవరు?.. విధ్వంసానికి బాధ్యత ఎవరిది?

యుద్ధాన్ని లాభనష్టాల వ్యాపారంగా మారుస్తున్న అగ్రరాజ్యాల ధోరణి

యుద్ధం అంటే రెండు దేశాల మధ్య సైనిక పోరాటమా? ఆధిపత్యం కోసం సాగించే విధ్వంసమా? లేక లాభనష్టాలను బేరీజు వేసుకునే వ్యాపారమా? అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ఈ ప్రశ్నలను మరోసారి ప్రపంచం ముందుకు తీసుకొచ్చాయి. ఇరాన్‌తో యుద్ధానికి పెద్దగా ఖర్చు కాలేదని, వెనెజువెలా నుంచి తరలించిన ముడిచమురు ఆదాయంతో ఆ వ్యయాన్ని భర్తీ చేసుకున్నామని ఆయన ప్రకటించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అయితే యుద్ధంలో కోల్పోయిన ప్రాణాలు, ధ్వంసమైన నగరాలు, ఛిన్నాభిన్నమైన కుటుంబాల భవిష్యత్తుకు ఏ చమురు సంపదతో వెల కట్టగలరన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇరాన్‌తో యుద్ధం కోసం అమెరికా ఇప్పటివరకు సుమారు 4,700 కోట్ల డాలర్లు ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. అయితే వెనెజువెలా చమురు ద్వారా వచ్చిన ఆదాయంతో ఈ మొత్తాన్ని భర్తీ చేసుకున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఎంత చమురు తరలించారు? ఎంత ఆదాయం సమకూరింది? ఆ నిధులు యుద్ధ వ్యయానికి ఎలా వినియోగించారు? అనే అంశాలపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. యుద్ధ వ్యయాన్ని కేవలం ఆయుధాలు, క్షిపణులు, యుద్ధ విమానాల ఖర్చుతోనే లెక్కించలేం. ధ్వంసమైన మౌలిక సదుపాయాలు, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ, ఉపాధి కోల్పోయిన ప్రజలు, నిర్వాసితులైన కుటుంబాల నష్టాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. డాలర్లతో ఆయుధాలు కొనవచ్చేమో గానీ, యుద్ధంలో కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేం. పశ్చిమాసియా రాజకీయాల్లో చమురు దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోంది. ఇంధన వనరులపై ఆధిపత్యం, సముద్ర రవాణా మార్గాల నియంత్రణ, ఆర్థిక ఆంక్షలు అగ్రరాజ్యాల విదేశాంగ విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. వెనెజువెలా చమురు ఆదాయాన్ని ఇరాన్ యుద్ధంతో ముడిపెట్టి ట్రంప్ మాట్లాడటం ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. సహజ వనరులు ఆయా దేశాల ప్రజల సంక్షేమానికి ఉపయోగపడాలి. కానీ వాటిని రాజకీయ ఆధిపత్యానికి, సైనిక ప్రయోజనాలకు సాధనంగా మార్చడం అంతర్జాతీయ సంబంధాల్లో కొత్త సంక్షోభాలకు దారితీసే ప్రమాదముంది.

యుద్ధం కొనసాగిస్తూనే శాంతి చర్చలా?

ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు తొందర లేదని ట్రంప్ వ్యాఖ్యానించడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు అమెరికాతో చర్చలకు ఇరాన్ ఆసక్తి చూపుతోందని ఆయన పేర్కొన్నారు. ఆ దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారిందని, సైనికులు, పోలీసులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితి ఏర్పడిందని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులో లేదు. ఇదే సమయంలో అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా రూపొందినట్లు సమాచారం. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను మూడో దేశానికి తరలించడం లేదా వాటి శుద్ధి స్థాయిని తగ్గించడం వంటి ప్రతిపాదనలు అందులో ఉన్నట్లు తెలుస్తోంది. అణు కార్యక్రమాలపై అంతర్జాతీయ పర్యవేక్షణ, పరస్పర విశ్వాసం లేకుండా శాశ్వత శాంతి సాధించడం కష్టమే.

హర్మూజ్ జలసంధిపై ప్రపంచం ఆందోళన

ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవాలనే అంశం ఉన్నట్లు సమాచారం. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన ఈ మార్గంలో అంతరాయాలు ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన ధరలు పెరిగే ప్రమాదముంది. ముఖ్యంగా భారత్ వంటి చమురు దిగుమతులపై ఆధారపడే దేశాలపై ఆ ప్రభావం అధికంగా ఉంటుంది. అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు ఖతార్‌లో జరిగే అవకాశముందని, ఒప్పందం అమలుకు చైనా హామీదారుగా వ్యవహరించవచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

యుద్ధం లాభసాటి వ్యాపారం కాదు!

యుద్ధాన్ని గెలుపోటములు, ఆర్థిక లాభనష్టాల కోణంలో చూడటం అగ్రరాజ్యాల నాయకులకు సులభమే. కానీ యుద్ధం మిగిల్చే గాయాలు తరతరాలపాటు వెంటాడుతాయి. ఒక దేశాన్ని సైనికంగా బలహీనపరచవచ్చేమో గానీ, శాశ్వత శాంతిని ఆయుధాలతో సాధించలేం. అందుకు దౌత్యం, పరస్పర గౌరవం, అంతర్జాతీయ ఒప్పందాల అమలు అవసరం. ప్రపంచం ఎదురుచూస్తున్నది యుద్ధానికి ఎంత ఖర్చయింది? ఆ ఖర్చును ఎలా రాబట్టారు? అనే లెక్కల కోసం కాదు. దాడులు ఎప్పుడు ఆగుతాయి? అణు ముప్పు ఎప్పుడు తొలగుతుంది? ప్రజలకు భద్రత ఎప్పుడు లభిస్తుంది? అన్న ప్రశ్నలకు సమాధానాల కోసం. యుద్ధానికి ఖర్చయిన డాలర్లను చమురు ఆదాయంతో భర్తీ చేయగలమని చెప్పవచ్చు. కానీ యుద్ధంలో కోల్పోయిన ప్రాణాలను, కన్నీళ్లను, ధ్వంసమైన భవిష్యత్తును ఏ సంపదతోనూ భర్తీ చేయలేం. యుద్ధంలో ఎంత సంపాదించామన్నది గొప్పతనం కాదు.. యుద్ధాన్ని ఆపి ఎన్ని ప్రాణాలను కాపాడామన్నదే నిజమైన నాయకత్వానికి కొలమానం!

జ్ఞానేశ్‌పై 'ప్రజా అభిశంసన'

- ప్రతిపక్షాల ప్రత్యామ్నాయ పార్లమెంట్!
- ఢిల్లీలో ఇండియా కూటమి వినూత్న నిరసన కార్యక్రమం
- ఖర్గే నివాసంలో మాక్ పార్లమెంట్
- సభాపతిగా మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా
- జ్ఞానేశ్ కుమార్‌పై తీర్మానం ప్రవేశపెట్టిన మల్లికార్జున ఖర్గే
- సోనియా, రాహుల్ సహా ప్రతిపక్ష అగ్రనేతల హాజరు
- ఓటర్ల జాబితా సవరణపై తీవ్ర ఆరోపణలు.. బీజేపీ ఎదురుదాడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిని నిరసిస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి దేశ రాజధానిలో వినూత్న నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న కూటమి నేతలు శనివారం ఢిల్లీలో ప్రత్యామ్నాయ పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్ కుమార్‌పై ప్రజా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ సభాపతి పాత్ర పోషించగా, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ఇండియా కూటమికి చెందిన పలువురు నాయకులు, ముఖ్యమంత్రులు పాల్గొన్నట్లు సమాచారం. ప్రతిపక్షాలు ఏర్పాటు చేసిన మాక్ పార్లమెంట్‌లో మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ సభాపతి బాధ్యతలు నిర్వహించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రజా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితాల సవరణ, ఓటు హక్కు పరిరక్షణ వంటి అంశాలపై చర్చ చేపట్టారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్చ ముగింపులో ప్రసంగించనున్నట్లు కూటమి వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా చేపడుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఇండియా కూటమి నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం అధికారిక వివరణను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఓటు హక్కును పరిరక్షించడం, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టడం తమ లక్ష్యమని ప్రతిపక్ష నేతలు పేర్కొంటున్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని కోరుతున్నారు. ఈ అంశాలపై ప్రజల దృష్టిని ఆకర్షించేందుకే ప్రత్యామ్నాయ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కూటమి వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపక్షాల మాక్ పార్లమెంట్ కార్యక్రమంపై బీజేపీ విమర్శలు గుప్పించింది. రాహుల్ గాంధీ వాస్తవ రాజకీయాల్లో విజయం సాధించలేక తనకు నచ్చిన పార్లమెంట్‌ను తానే ఏర్పాటు చేసుకున్నారని ఎద్దేవా చేసింది. ప్రతిపక్షాల కార్యక్రమాన్ని రాజకీయ ప్రచార ప్రయత్నంగా అభివర్ణించింది. దీంతో ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న మాక్ పార్లమెంట్ ఒక ప్రతీకాత్మక రాజకీయ నిరసన కార్యక్రమం మాత్రమే. ఇందులో ప్రవేశపెట్టిన ప్రజా అభిశంసన తీర్మానానికి పార్లమెంట్‌లో అధికారికంగా చేపట్టే తొలగింపు ప్రక్రియతో సంబంధం లేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలంటే రాజ్యాంగంలోని 324(5) అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి తొలగింపునకు వర్తించే విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.

నింగిలో మరో విజయం.. ఇస్రోకు మోదీ ప్రశంసలు!

జీఎస్ఎల్వీ-ఎఫ్18 ప్రయోగం విజయవంతం

నిర్దేశిత కక్ష్యలోకి ఎన్వీఎస్-03 నావిగేషన్ ఉపగ్రహం

శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు ప్రధాని అభినందనలు

మరింత బలోపేతం కానున్న స్వదేశీ 'నావిక్' వ్యవస్థ

సాంకేతిక స్వావలంబన దిశగా మరో ముందడుగన్న మోదీ

శ్రీహరికోట, అక్టోబర్ 31 (సమయం న్యూస్): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ఎన్వీఎస్--03 నావిగేషన్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు అభినందనలు తెలియజేశారు. భారత అంతరిక్ష శాస్త్రవేత్తల పట్టుదల, అంకితభావం దేశానికి గర్వకారణమని కొనియాడారు. స్వదేశీ ఉపగ్రహ ఆధారిత దిశానిర్దేశ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఈ ప్రయోగం కీలక ముందడుగని పేర్కొన్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం రెండో ప్రయోగ వేదిక నుంచి శుక్రవారం రాత్రి 11.51 గంటలకు జీఎస్ఎల్వీ--ఎఫ్18 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లినట్లు ప్రయోగ వివరాలు వెల్లడిస్తున్నాయి. మూడు దశలతో రూపొందించిన ఈ రాకెట్ ఎత్తు 50 మీటర్లు కాగా, ప్రయోగ సమయంలో మొత్తం బరువు సుమారు 420 టన్నులు. వివిధ దశలను విజయవంతంగా అధిగమించిన అనంతరం 2,232 కిలోల బరువున్న ఎన్వీఎస్--03 ఉపగ్రహాన్ని భూసమకాలిక బదిలీ కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ప్రాంతీయ ఉపగ్రహ దిశానిర్దేశ వ్యవస్థ 'నావిక్' సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఎన్వీఎస్-03 కీలక పాత్ర పోషించనుంది. దేశవ్యాప్తంగా దిశానిర్దేశ సేవలను మరింత సమర్థంగా అందించేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. ముఖ్యంగా రవాణా, సముద్రయానం, అత్యవసర సేవలు, భౌగోళిక స్థాన నిర్ధారణ వంటి రంగాల్లో ఉపగ్రహ ఆధారిత సేవలను మెరుగుపరిచే అవకాశముంది. ఎన్వీఎస్-03 ఉపగ్రహంలో స్వదేశీ, విదేశీ అణు గడియారాలను అమర్చినట్లు ప్రయోగ వివరాల్లో పేర్కొన్నారు. ఉపగ్రహ ఆధారిత దిశానిర్దేశ వ్యవస్థల్లో సమయాన్ని అత్యంత కచ్చితంగా లెక్కించడం కీలకం. ఈ గడియారాల సహాయంతో స్థాన నిర్ధారణ, సమయ సమాచార సేవల కచ్చితత్వాన్ని మెరుగుపరచవచ్చు. తద్వారా నావిక్ వ్యవస్థ పనితీరు మరింత సమర్థంగా మారనుంది. ఈ ప్రయోగ విజయాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఇస్రో బృందాన్ని అభినందించారు. భారత అంతరిక్ష పరిశోధన రంగంలో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు కనబరుస్తున్న నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ బలోపేతం కావడం ద్వారా ప్రజలకు ఉపయోగపడే సేవలు మరింత విస్తరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యాధునిక సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించాలన్న భారత లక్ష్యానికి ఇటువంటి ప్రయోగాలు మరింత బలాన్నిస్తాయని తెలిపారు. ఉపగ్రహ ఆధారిత దిశానిర్దేశ సేవల కోసం విదేశీ వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంలో నావిక్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. దేశీయ అవసరాలకు అనుగుణంగా సొంత వ్యవస్థను అభివృద్ధి చేసుకోవడం వ్యూహాత్మకంగానూ కీలకమే. ఈ నేపథ్యంలో ఎన్వీఎస్-03 వంటి ఉపగ్రహాలు భారత అంతరిక్ష సాంకేతిక సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నాయి. అంతరిక్షంలో భారత్ సాధిస్తున్న విజయాల పరంపరలో మరో కీలక ఘట్టంగా ఈ ప్రయోగాన్ని పేర్కొంటున్నారు. స్వదేశీ సాంకేతికతతో ప్రపంచానికి తన సామర్థ్యాన్ని చాటుతున్న ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు తెలియజేయడం విశేషంగా నిలిచింది.

పోలీస్ కార్యాలయంలోనే బాలికపై లైంగికదాడి

సహాయం కోరిన బాలికపై పోలీస్ అధికారి అఘాయిత్యం

అరాచకానికి మహిళా ఉద్యోగిని సహకారం దారుణం

పనాజీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : రక్షణ కల్పించాల్సిన రక్షక భటుడే భక్షకుడిగా మారి దారుణానికి ఒడిగట్టిన ఘటన ఉత్తర గోవాలో తీవ్ర సంచలనం సృష్టించింది. న్యాయం కోసం సహాయాన్ని కోరి వచ్చిన ఒక 16 ఏళ్ల మైనర్ బాలికపై క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలోనే పోలీస్ అధికారి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అరాచకానికి ఆ అధికారి వద్ద పనిచేసే సహచర మహిళా ఉద్యోగిని కూడా సంపూర్ణంగా సహకరించడం గమనార్హం. బాధిత బాలిక ధైర్యంగా ముందుకు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితులైన వారిద్దరిపై పలు కఠిన చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. 16 ఏళ్ల బాధిత బాలిక తనకున్న సమస్యపై సహాయం కోసం తొలుత స్థానిక బాలల సహాయ కేంద్రాన్ని సంప్రదించింది. ఈ క్రమంలో ఆమె ఫిర్యాదును తగిన పరిశీలన, విచారణ కోసం రిబాందర్‌లోని క్రైమ్ బ్రాంచ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వికాస్ దేకర్‌కు అధికారులు పంపారు. అయితే విచారణ సాకుతో జూలై 25, అక్టోబర్ 27 తేదీలలో క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలోనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ వికాస్ దేకర్ ఆ బాలికపై దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రూరత్వానికి ఆ పోలీస్ అధికారి సహచరురాలైన మహిళా సిబ్బంది రంజినీ పల్యేకర్ కూడా ప్రత్యక్షంగా సహకరించినట్లు బాధిత బాలిక తన ఫిర్యాదులో ఆరోపించింది. దీంతో నిందితులు వికాస్ దేకర్, రంజినీ పల్యేకర్‌లపై పోక్సో చట్టంతో పాటు ఇతర తీవ్రమైన సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ దారుణ ఘటనపై స్పందించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అలోక్ కుమార్.. పోలీస్ శాఖలో ఇలాంటి దుష్ప్రవర్తనల పట్ల ఏమాత్రం సహించేది లేదని, జీరో టాలరెన్స్ విధానాన్ని కచ్చితంగా అనుసరిస్తున్నట్లు స్పష్టం చేశారు. నిందితుడైన ఇన్ స్పెక్టర్ వికాస్ దేకర్‌తో పాటు ఆయన సహచరురాలిపై తక్షణమే చట్టపరమైన, తీవ్రమైన శాఖాపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా ఈ కేసును పారదర్శక విచారణ కోసం ఓల్డ్ గోవా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన మీడియాకు తెలియజేశారు.

ఐఏఎఫ్ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతల స్వీకారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్): భారత వైమానిక దళ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం పదవీ విరమణ చేయగా, దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దాదాపు 20 రకాల యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఉన్న అశుతోష్ దీక్షిత్.. 2028 డిసెంబర్ 31 వరకు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. వ్యూహాత్మక ప్రణాళికల్లో పేరొందిన ఆయన ఆపరేషన్ సింధూర్ సమయంలో కీలకపాత్ర పోషించారు. ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ 1966 డిసెంబర్ 9న జన్మించారు. 1986 డిసెంబర్ 6న వాయుసేనలో చేరారు. నాలుగు దశాబ్దాల కాలంలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. మిరాజ్-2000, కిరణ్, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి యుద్ధ విమానాల్లో 3,500 గంటలకు పైగా విమానయానం చేసిన అనుభవం ఉంది. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సింధూర్ వంటి అనేక కీలక ఆపరేషన్లలో పనిచేశారు.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నలకు తాళమేస్తే.. జరిగేదిదేనా?

ఒకవైపు విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడులు.. మరోవైపు అధికారుల వ్యవహారశైలిపై ప్రజల ప్రశ్నలు.. ఇంకోవైపు ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై కేసులు, విచారణలు! ఈ పరిణామాలన్నింటి మధ్య ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎదురవుతున్న అసలు పరీక్ష ఏమిటి? అధికారం ప్రజల భద్రతకు భరోసా కల్పించాలా? లేక ప్రశ్నించే గొంతులను నియంత్రించే సాధనంగా మారాలా? చట్టాన్ని అమలు చేసే వ్యవస్థకు గౌరవం, రక్షణ ఎంత అవసరమో, ఆ వ్యవస్థ పనితీరుపై ప్రజలకు ప్రశ్నించే హక్కు కూడా అంతే అవసరం. ఈ రెండింటి మధ్య సమతుల్యత దెబ్బతింటే ప్రజలకు వ్యవస్థపై ఉన్న విశ్వాసమే ప్రశ్నార్థకమవుతుంది. అక్టోబర్ 29న ఆదిలాబాద్ రిమ్స్‌లో యువకుడు రాహుల్ కాంబ్లే మృతి ఈ చర్చను మరింత తీవ్రం చేసింది. చికిత్సలో నిర్లక్ష్యాన్ని తన ఫోన్‌లో చిత్రీకరించిన విషయంలో వైద్య సిబ్బందితో వివాదం తలెత్తిందని, అనంతరం పోలీసుల వ్యవహారశైలితో మనస్తాపానికి గురై ప్రాణాలు తీసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. రాహుల్ రాసినట్లు చెబుతున్న లేఖలోనూ వైద్య, పోలీసు సిబ్బందిపై ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు పోలీసు స్టేషన్‌లో దాడి జరిగిందన్న ఆరోపణను పోలీసులు ఖండిస్తూ, తమ వద్ద వీడియో ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. తండ్రి ఫిర్యాదు మేరకు సంబంధిత వైద్య, పోలీసు సిబ్బందిపై కేసు నమోదైంది. ఇక్కడ కేసు నమోదు కావడం ఒక చట్టపరమైన ప్రక్రియ. ఆరోపణలు నిరూపితమయ్యాయని దాని అర్థం కాదు. లేఖ, వీడియోలు, వైద్య రికార్డులు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను నిష్పక్షపాతంగా పరిశీలించి నిజానిజాలు తేల్చాలి. ఒక యువకుడి మరణానికి దారితీసిన పరిస్థితులపై పారదర్శక విచారణ జరగాలి. తప్పు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. నిరాధార ఆరోపణలతో ఎవరినీ ముందుగానే దోషిగా ముద్ర వేయకూడదు. ప్రజల ప్రాణాలు, గౌరవం, హక్కులను కాపాడటంతోపాటు, వాటిని పరిరక్షించే వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడం కూడా ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత.

ప్రజల భద్రత కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీసు, అటవీ సిబ్బందికి ఎదురవుతున్న సవాళ్లను విస్మరించడం సాధ్యం కాదు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేశవపట్నంలో 2025 జూలై 19న అటవీ శాఖ మొక్కల పెంపకం కార్యక్రమం సందర్భంగా అటవీ, పోలీసు సిబ్బందిపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్‌తో సహా 11 మంది అధికారులు గాయపడ్డారు. అదే జిల్లా సిరికొండ మండలం వాయిపేట్‌లో 2026 అక్టోబర్ 10న గంజాయి సాగు కేసు దర్యాప్తునకు వెళ్లిన పోలీసు బృందంపై దాడి జరిగింది. పలువురు సిబ్బంది గాయపడగా, ఈ కేసులో 20 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని సిమెంట్ పరిశ్రమ వద్ద 2025 సెప్టెంబర్‌లో కార్మికుల ఆందోళన సందర్భంగా పోలీసులపై రాళ్లు రువ్విన ఘటనలో ఇద్దరు సిబ్బందికి గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో 2026 ఫిబ్రవరిలో జరిగిన ఘర్షణల్లో ఓ కానిస్టేబుల్ గాయపడగా, 12 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సీతగొండలో 2025 డిసెంబర్‌లో ఎన్నికల నియమావళి అమలు సందర్భంగా జరిగిన ఘర్షణలో ఓ ఎస్ఐపై దాడి, పోలీసు వాహనాల ధ్వంసం చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలు వేర్వేరు ప్రాంతాల్లో, వేర్వేరు పరిస్థితుల్లో జరిగినప్పటికీ విధి నిర్వహణలో సిబ్బందికి ఎదురవుతున్న ప్రమాదాలను స్పష్టం చేస్తున్నాయి. చట్టబద్ధమైన విధులను నిర్వర్తిస్తున్న సిబ్బందిపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి. అయితే ఘటన జరిగిన తర్వాత అరెస్టులు, కేసులకే పరిమితం కాకుండా ముందస్తు నివారణ చర్యలపైనా దృష్టి పెట్టాలి. ఉద్రిక్త పరిస్థితులను ముందుగానే గుర్తించే సమాచార వ్యవస్థ ఉందా? అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారా? క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన శిక్షణ, రక్షణ పరికరాలు, స్పష్టమైన కార్యాచరణ మార్గదర్శకాలు అందుతున్నాయా? అత్యవసర పరిస్థితుల్లో అదనపు బలగాలను సమన్వయం చేసే వ్యవస్థ ఎంత వేగంగా స్పందిస్తోంది? అనే అంశాలపై సమీక్ష జరగాలి. సిబ్బంది భద్రతకు అవసరమైన వనరులు కల్పించడం శాఖాపరమైన బాధ్యత. వారి ప్రాణాలకు రక్షణ కల్పించడం ప్రజా భద్రతలో భాగం. పోలీసులపై దాడులను ఖండించడం మాత్రమే కాదు.. అలాంటి దాడులు జరగకుండా వ్యవస్థాగతంగా సిద్ధంగా ఉండటమే సమర్థమైన పరిపాలనకు నిదర్శనం.

రీల్స్ రచ్చ.. సూపర్‌విజన్ సున్నాయేనా?

ఒకవైపు పోలీసు సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తుంటే, మరోవైపు ప్రజల భద్రత కోసం కేటాయించిన అధికారిక వాహనాల వినియోగంపై వివాదాలు తలెత్తడం వ్యవస్థలో పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా ఈగలపెంటలో 2025 ఏప్రిల్‌లో పోలీసు పెట్రోలింగ్ వాహనం రీల్స్ చిత్రీకరణకు ఉపయోగించిన ఘటన చర్చకు వచ్చింది. ఆ వాహనం ఒక ఎస్ఐకి కేటాయించిందని, ఆయన మనవడు ఉపయోగించినట్లు అప్పటి జిల్లా ఎస్పీ వెల్లడించారు. 2025 నవంబర్‌లో ఆదిలాబాద్‌లోనూ పోలీసు వాహనంలో యువకులు రీల్స్ చిత్రీకరించిన ఘటనపై కేసు నమోదైంది. హైదరాబాద్‌లో 2019లో పోలీసు వాహనంపై యువకుడు కూర్చున్న వీడియో, 2022లో అసిఫ్‌నగర్ పరిధిలో కదులుతున్న పెట్రోలింగ్ వాహనంపైకి యువకుడు ఎక్కిన ఘటనలు కూడా గతంలో చర్చకు వచ్చాయి. ఈ ఘటనలన్నింటినీ ఒకే స్థాయి తప్పిదాలుగా చూడలేం. అయినా ప్రభుత్వ వాహనాల వినియోగం, భద్రత, పర్యవేక్షణపై స్పష్టమైన సమీక్ష అవసరమనే విషయాన్ని ఇవి ముందుకు తెస్తున్నాయి. వాహనాలు ఎవరికి కేటాయించారు? వాటి తాళాలు, వినియోగం, భద్రతపై పర్యవేక్షణ ఎవరిది? నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగిస్తే బాధ్యత ఎవరు వహించాలి? అనే అంశాల్లో స్పష్టమైన ప్రొటోకాల్ ఉండాలి. హోదా, పరిచయం, బంధుత్వం ఆధారంగా ఎవరికీ ప్రత్యేక మినహాయింపు ఉండకూడదు. ఇదే జవాబుదారీతనం ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిజానికీ వర్తిస్తుంది. ఖమ్మంలో ఎరువుల కొరతపై వార్తా కథనం ప్రసారం చేసిన టీవీ విలేకరిపై కేసు నమోదైన ఘటనపై మీడియా వర్గాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. నారాయణపేట జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్టు, ఫొటోగ్రాఫర్‌పై దాడి జరిగిందనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌లో జర్నలిస్టు జల్లి రేఖను విచారణకు పిలిచిన తీరుపై కుటుంబ సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మహిళా ఐఏఎస్ అధికారిపై పరువు నష్టం కలిగించే కంటెంట్ ప్రసారం చేశారనే ఆరోపణలతో ఇద్దరు టీవీ జర్నలిస్టులు అరెస్టై, అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. ప్రతి కేసులోనూ ఆరోపణల స్వరూపం, ఆధారాలు, చట్టపరమైన అంశాలు వేర్వేరుగా పరిశీలించాలి. జర్నలిస్టులకు చట్టం నుంచి మినహాయింపు లేదు. వృత్తి పేరుతో బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడినా చట్టం తన పని తాను చేసుకోవాలి. పాత ఆదిలాబాద్ జిల్లాలో కొందరు జర్నలిస్టులపై ఇటువంటి ఆరోపణలు వచ్చిన సందర్భాలున్నాయి. వాటిపైనా ఆధారాలతో విచారణ జరగాలి. అదే సమయంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు లేదా అసౌకర్యం కలిగించే అంశాలను వెలుగులోకి తెచ్చినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం సమర్థనీయం కాదు. విచారణకు పిలవడం చట్టబద్ధమైన ప్రక్రియలో భాగమే కావచ్చు. కానీ దాని అవసరం, విధానం, వ్యక్తిగత గౌరవం, చట్టబద్ధమైన హక్కులు కూడా పరిగణనలోకి రావాలి. వృత్తిపరమైన తప్పిదాన్ని చట్టం పరిశీలించాలి.. ప్రజా ప్రయోజనంతో కూడిన ప్రశ్నను మాత్రం వ్యక్తిగత కక్షగా చూడకూడదు. ఈ రెండింటి మధ్య స్పష్టమైన గీత ఉండాలి.

అకౌంటబిలిటీకి మినహాయింపులున్నాయా?

పోలీసుల భద్రత, ప్రజల హక్కులు, జర్నలిస్టుల స్వేచ్ఛ, అధికారుల జవాబుదారీతనం.. ఇవన్నీ విడివిడి అంశాలుగా కనిపించినా రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో పరస్పరం అనుసంధానమైనవే. 2024 జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ నేరాల నిర్వచనం, దర్యాప్తు, న్యాయ ప్రక్రియ, సాక్ష్యాల విషయంలో కొత్త చట్టపరమైన వ్యవస్థను అందించాయి. చట్టాలు మారినా న్యాయసూత్రాల ప్రాధాన్యం మారదు. రాజ్యాంగంలోని 14వ అధికరణం చట్టం ముందు సమానత్వాన్ని హామీ ఇస్తుంది. 19వ అధికరణం భావప్రకటనా స్వేచ్ఛను రాజ్యాంగబద్ధ పరిమితులకు లోబడి పరిరక్షిస్తుంది. 21వ అధికరణం జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుంది. ఈ హక్కులు చట్టబద్ధమైన దర్యాప్తును అడ్డుకోవు. అదే సమయంలో దర్యాప్తు పేరుతో వ్యక్తి గౌరవం, స్వేచ్ఛ, హక్కులను విస్మరించేందుకు అనుమతించవు. పోలీసులపై దాడి జరిగితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. పోలీసు సిబ్బంది లేదా ఇతర అధికారులపై అధికార దుర్వినియోగ ఆరోపణలు వస్తే వాటిపైనా నిష్పక్షపాతంగా విచారణ జరగాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల లోపాలను ప్రశ్నించే రోగులు, వారి కుటుంబ సభ్యుల వాదన వినాలి. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై ఫిర్యాదులు వస్తే ఆధారాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం విచారణ జరగాలి. విచారణకు పిలిచే సందర్భంలో చట్టబద్ధమైన నోటీసులు, అవసరమైన ప్రక్రియ, వ్యక్తిగత గౌరవం పాటించాలి. ఫిర్యాదు చేసినవారికి న్యాయం అందాలి.. ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి తమ వాదన వినిపించే అవకాశం ఉండాలి. తప్పు చేసినవారిని రక్షించడం ఎంత తప్పో, విచారణ పూర్తికాకముందే ఎవరినైనా దోషిగా చిత్రించడం కూడా అంతే తప్పు. ప్రజాస్వామ్యంలో అధికారం అనేది బాధ్యతతో కూడిన ప్రజా నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టేది ఆదేశాల కఠినత కాదు.. చట్టబద్ధత, పారదర్శకత, జవాబుదారీతనం. పోలీసు సిబ్బందికి రక్షణ కల్పించాలి. ప్రజల హక్కులను గౌరవించాలి. జర్నలిస్టుల వృత్తి స్వేచ్ఛను పరిరక్షించాలి. అధికారుల చర్యలు ప్రజా పరిశీలనకు నిలబడాలి. ఈ నాలుగు అంశాలు పరస్పర విరుద్ధమైనవి కావు.. బలమైన ప్రజాస్వామ్యానికి నాలుగు అవసరమైన స్తంభాలు. ప్రజాస్వామ్యానికి ముప్పు ప్రశ్నలు అడగడంలో లేదు.. వాటికి సమాధానం చెప్పకుండా అధికారాన్ని వినియోగించడంలో ఉంది. చట్టం ముందు అందరూ సమానమే అనే సూత్రం ఆచరణలో కనిపించినప్పుడే ప్రజలకు వ్యవస్థపై విశ్వాసం నిలుస్తుంది.

ఎల్లల సంతోష్ కుమార్,
ప్రాంతీయ నిర్వహణ కార్యదర్శి
తెలంగాణ వినియోగదారుల సంస్థల సమాఖ్య (క్యాట్‌కో)
6301044014

సీఈసీని జవాబుదారీ చేస్తాం!

జ్ఞానేశ్ కుమార్‌పై రాహుల్ గాంధీ ఫైర్

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈసీతో పాటు ఇతర అధికారులను జవాబుదారీతనం నుంచి తప్పించుకోనివ్వబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో వీరంతా భారత ప్రజల ప్రతినిధుల ఎదుట కచ్చితంగా సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దేశంపై జరుగుతున్న దాడిలో సీఈసీ కూడా భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడేందుకు ప్రతిపక్షాలు నిరంతరం పోరాడుతున్నాయని పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ విపక్ష కూటమి (ఇండియా) నిర్వహించిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమంలో రాహుల్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.

13.3 కోట్ల ఓట్ల గల్లంతు!

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో దేశంలోని మొత్తం ఓటర్లలో 15 శాతానికి సమానమైన 13.3 కోట్ల మంది పేర్లను తొలగించారని రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. అంటే ప్రతి ఏడుగురిలో ఒకరి ఓటు హక్కును అన్యాయంగా తొలగించినట్లేనని వ్యాఖ్యానించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య ఓట్ల వ్యత్యాసం కేవలం మూడు శాతమేనని గుర్తుచేశారు. ఇంత పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్ల తొలగింపు కచ్చితంగా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపి ఉంటుందని అన్నారు. ఈ పరిణామాలతో 2024 లోక్‌సభ ఎన్నికల చట్టబద్ధతపైనా తీవ్ర సందేహాలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

మోదీ, అమిత్ షాల పాత్ర ఉంది..

ఎస్ఐఆర్‌లో జరిగిన అక్రమాలకు సంబంధించి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తమ వద్ద తగిన ఆధారాలు ఉన్నాయని రాహుల్ కుండబద్దలు కొట్టారు. ఆ ఆధారాలను బయటపెట్టిన తర్వాత కూడా బీజేపీ ఆయనను పదవిలో కొనసాగించాలని పట్టుబడితే.. ఆ పార్టీ అసలు ఉద్దేశం ఏమిటో దేశ ప్రజలకు స్పష్టమవుతుందని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'మాక్ పార్లమెంట్'ను కేవలం ఎంపీలు, పౌరుల సమావేశంగా చూడకూడదని, ఎన్నికల వ్యవస్థను దెబ్బతీసిన వారిపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే వేదికగా భావించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల పాత్ర కూడా ఉందని రాహుల్ ఆరోపించారు.

నేడు రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ!

ఇదిలా ఉండగా.. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'ఇండియా' కూటమి ర్యాలీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిపక్ష నేతలు, పార్టీల కార్యకర్తలు భారీ సంఖ్యలో ఢిల్లీకి చేరుకుంటున్నారు. ప్రధాన వేదికపై భారీ త్రివర్ణ పతాకాన్ని ఏర్పాటు చేయడంతో పాటు కూటమి భాగస్వామ్య పార్టీల ప్రతినిధులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించారు. మింటో రోడ్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు పాదయాత్ర నిర్వహించి, అనంతరం రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సంస్థల భాగస్వామ్యంతో భారీ ర్యాలీ చేపట్టాలని విపక్షాలు నిర్ణయించాయి.

దేశాన్ని చీల్చే కుట్రలు.. అప్రమత్తంగా ఉండాలి!

- దిమాగీ నక్సల్స్ వదంతులతో అస్థిరత సృష్టిస్తున్నారు
- ప్రజల ఐక్యతే దేశానికి రక్షణ కవచమన్న ప్రధాని మోదీ
- ప్రపంచ ఇంధన సంక్షోభం భారత్‌పై పడకుండా కాపాడాం
- పేదరికం తొలగిస్తామన్న పార్టీల నేతలే కుబేరులయ్యారు
- ఏక్తానగర్‌లో ఘనంగా సర్దార్ పటేల్ 151వ జయంతి
- స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద మోదీ పుష్పాంజలి, పరేడ్

ఏక్తానగర్, అక్టోబర్ 31 (సమయం న్యూస్): దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే ఉద్దేశంతో పనిచేస్తున్న దిమాగీ నక్సల్స్ పట్ల ప్రజలంతా తీవ్ర అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమై దేశంలో విభజనను ప్రోత్సహించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. సామాజిక మాధ్యమాల ద్వారా అబద్ధాలు, వదంతులు వ్యాప్తి చేస్తూ సమాజంలో అస్థిరత సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ ప్రజల మధ్య ఉన్న ఐక్యతే బలమైన రక్షణ కవచమని ప్రధాని పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఆశయాలను అనుసరిస్తూ దేశం అభివృద్ధి పథంలో సాగుతోందని మోదీ స్పష్టం చేశారు.

సంక్షోభం నుంచి కాపాడుకున్నాం..

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన కొరత నెలకొన్నప్పటికీ భారత ప్రజలను ఆ సంక్షోభ ప్రభావాల నుంచి కాపాడుకోగలిగామని ప్రధాని మోదీ సంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై ఆంక్షలు విధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. భారీ జనాభా ఉన్న భారత్‌లోనూ తీవ్ర ఇంధన సంక్షోభం తలెత్తుతుందని గతంలో అంచనాలు వెలువడ్డాయని చెప్పారు. అయితే ప్రపంచ ఇంధన సంక్షోభం మన దేశ ప్రజలపై ఏమాత్రం ప్రభావం చూపకుండా ఎదుర్కోవడం భారత సామర్థ్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా అస్థిర పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో భారతీయుల ఐక్యతే దేశానికి ప్రధాన బలమని ఉద్ఘాటించారు.

నినాదాలు చేసిన వారే కుబేరులయ్యారు..

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పేదరిక నిర్మూలన పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు హామీలు ఇస్తున్నాయని ప్రధాని మోదీ విమర్శించారు. పేదరికాన్ని తొలగిస్తామని నినాదాలు చేసినవారే మరింత సంపన్నులు (కుబేరులు) అయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. కానీ, ప్రస్తుతం భారత్ అపూర్వమైన శక్తి, దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని.. ప్రజల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసమే దీనికి కారణమని మోదీ వివరించారు.

ఘనంగా పటేల్ జయంతి వేడుకలు..

భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ప్రధాని పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రత, ఐక్యతతో పాటు భారత జాతి నిర్మాణానికి పటేల్ చేసిన సేవలను కొనియాడారు. దృఢమైన, సంపన్నమైన, సమర్థవంతమైన దేశ నిర్మాణానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కవాతు..

నివాళుల కార్యక్రమం అనంతరం ఏక్తానగర్‌లో నర్మదా మాత విగ్రహం నుంచి రెప్లికా గార్డెన్ వరకు సాయుధ దళాల పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో సుమారు 10 వేల మంది పోలీసు, పారామిలటరీ సిబ్బంది కవాతులో పాల్గొన్నారు. వాయుసేన ఫ్లైపాస్ట్, భద్రతా బలగాల మోటార్‌సైకిల్ విన్యాసాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు, మార్షల్ ఆర్ట్స్, అశ్వ, ఒంటె దళాల కవాతు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 4,700 మంది కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాయి. ఈ పరేడ్ అనంతరం ప్రసంగించిన మోదీ.. దేశం బాహ్య సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో కొన్ని శక్తులు వదంతులు వ్యాప్తి చేస్తూ విభజనకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలంతా ఐక్యంగా ఉండి ఆ కుట్రలను తిప్పికొట్టాలని మరోసారి పిలుపునిచ్చారు.

490 మందికి దక్షత పతకాలు!

విశిష్ట సేవలందించిన పోలీసు సిబ్బందికి పురస్కారాలు

సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా పతకాల ప్రకటన

నిఘా, భద్రత, ఫోరెన్సిక్ రంగంలో ప్రతిభకు గుర్తింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : అత్యుత్తమ పనితీరు, విశిష్ట దర్యాప్తు, నిఘా, భద్రతా సేవలతో పాటు ఫోరెన్సిక్ రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం పురస్కారాలు ప్రకటించింది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్), కేంద్ర పోలీసు సంస్థలకు చెందిన మొత్తం 490 మంది సిబ్బందికి 2026 సంవత్సరానికి గానూ ప్రతిష్ఠాత్మకమైన 'కేంద్ర గృహమంత్రి దక్షత పతకాన్ని' ప్రదానం చేశారు. భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది అక్టోబర్ 31న ఈ పతకాలను ప్రకటిస్తారన్న విషయం విదితమే.

నవంబర్ 5 నుంచి ఆంక్షలు!

ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు

ఆఫీసుల్లో 50 శాతం సిబ్బందితో వర్క్ ఫ్రమ్ హోమ్

ఎన్సీఆర్ పరిధిలో నిర్మాణ పనులపైనా నిషేధం

భారీ వర్షంతో స్వల్పంగా మెరుగైన గాలి నాణ్యత

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : ఢిల్లీ ఎన్సీఆర్‌లో వాయు కాలుష్య నియంత్రణకు కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం) కీలక ఆదేశాల జారీ చేసింది. నవంబర్‌లో కాలుష్యం తీవ్ర స్థాయికి చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఏక్యూఎం సూచించింది. నవంబర్ 5 నుంచి 20 వరకు పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో 50 శాతం సిబ్బందికే అనుమతి ఇవ్వనున్నారు. మిగిలిన 50 శాతం సిబ్బందికి వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయనున్నారు. ఢిల్లీ ఎన్సీఆర్‌లో దుమ్ము వెలువడే కూల్చివేత పనులు, బహిరంగ నిర్మాణ కార్యకలాపాలపైనా ఆంక్షలు విధించనున్నారు. అయితే.. రైల్వే స్టేషన్లు, మెట్రో, విమానాశ్రయాలు, ఆసుపత్రులతో పాటు రక్షణ రంగం, జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులకు మినహాయింపు ఇచ్చారు. హైవేలు, రోడ్లు, ఫ్లైఓవర్లు, ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణ పనులతో పాటు విద్యుత్ ట్రాన్స్‌మిషన్, పైప్‌లైన్లు, టెలికమ్యూనికేషన్ ప్రాజెక్టులకూ ఆంక్షలు వర్తించనున్నాయి. ఢిల్లీతో పాటు గురుగ్రాం, ఫరీదాబాద్, సోనిపట్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్ జిల్లాల్లో ఆంక్షలను అమలు చేస్తారు.

ఢిల్లీ విమానాశ్రయంలో పొగమంచు..

ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఢిల్లీలో శనివారం ఉదయం పొగమంచు కమ్ముకుంది. సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో 500 మీటర్లు, ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న పాలంలో 800 మీటర్ల వరకు మాత్రమే విజిబిలిటీ కనిపించిందని శనివారం భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. శుక్రవారం ఇదే సమయానికి ఈ రెండు ప్రాంతాల్లో విజిబిలిటీ 4,000 మీటర్లుగా ఉంది. సఫ్దర్‌జంగ్‌లో శనివారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి విజిబిలిటీ 500 మీటర్ల వద్దే కొనసాగుతోంది. పాలంలో ఉదయం 5 గంటల నుంచి 800 మీటర్లుగా రికార్డైంది. విజిబిలిటీ 500 నుంచి 999 మీటర్ల మధ్య ఉంటే దానిని స్వల్ప స్థాయి పొగమంచుగా, 200 నుంచి 499 మీటర్ల మధ్య ఉంటే మోస్తరు పొగమంచుగా, 50 నుంచి 199 మీటర్ల మధ్య ఉంటే దట్టమైన పొగమంచుగా భావిస్తారు. 50 మీటర్ల కన్నా తక్కువగా ఉంటే అతి దట్టమైన పొగమంచుగా వర్గీకరిస్తారు. ప్రస్తుతం సఫ్దర్‌జంగ్‌లో విజిబిలిటీ 500 మీటర్లకు పడిపోయింది. మరింత తగ్గితే మోస్తరు పొగమంచు ఏర్పడే అవకాశం ఉంది.

వర్షంతో తగ్గిన కాలుష్యం..

శుక్రవారం ఢిల్లీలో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా గాలిలోని కాలుష్య కారకాలు తగ్గాయి. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 60గా నమోదైందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఒక నివేదిక విడుదల చేసింది. గత నాలుగేళ్లలో అక్టోబర్‌లో ఇదే అత్యుత్తమ గాలి నాణ్యత. కాగా, శనివారం ఉదయం 6 గంటలకు ఏక్యూఐ 95కు పెరిగింది. అయినప్పటికీ గాలి నాణ్యత సంతృప్తికర స్థాయిలోనే ఉంది. ఉదయం నమోదైన 58 కేంద్రాల్లో 17 చోట్ల పీఎం 2.5, నాలుగు చోట్ల పీఎం 10 ప్రధాన కాలుష్య కారకాలుగా ఉన్నట్లు సమాచారం. అక్టోబర్‌లో మొదటి 30 రోజులకు ఢిల్లీ సగటు ఏక్యూఐ 167గా నమోదైంది.

1.27 కోట్ల మంది హిందువుల ఓట్లు గల్లంతు

- ఎస్ఎస్ఆర్ ప్రక్రియలో భారీగా అవకతవకలు
- మళ్లీ చేర్పించే బాధ్యత కార్యకర్తలదేనన్న యూపీ సీఎం యోగి

లక్నో, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రక్రియ తర్వాత ఓటర్ల జాబితా నుంచి కోట్లాది మంది హిందువుల పేర్లు గల్లంతయ్యాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.27 కోట్ల మంది హిందువులను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లందరినీ తిరిగి జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందని సీఎం నొక్కిచెప్పారు. ఈరోజు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో యోగి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్ ప్రక్రియ, హిందువుల ఓట్ల తొలగింపుపై కీలక వ్యాఖ్యలు చేశారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులను ఆయన హెచ్చరించారు.

వాస్తవానికి 16 కోట్ల మంది ఉండాలి..

ప్రస్తుతం యూపీలో సుమారు 13 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, అయితే వాస్తవానికి ఆ సంఖ్య 16 కోట్లకు పైగా ఉండాలని సీఎం యోగి చెప్పారు. పంచాయతీ ఓటర్ల జాబితాలో పేర్లున్న 66 లక్షల మంది అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాలో లేరని ఆరోపించారు. దీంతో 28 పట్టణ స్థానిక సంస్థల నియోజకవర్గాల్లో బీజేపీ బలహీనపడే పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న 55 లక్షల మంది పేర్లు కూడా ఓటర్ల జాబితాలో లేవని విమర్శించారు. అలాగే, 18–19 ఏళ్ల వయసున్న సుమారు 4.5 లక్షల మంది యువత ఓటర్ల జాబితాలో చోటు దక్కించుకోలేదని వెల్లడించారు. గత ఎస్ఎస్ఆర్ ప్రక్రియలో కేవలం నాలుగు లక్షల మందినే కొత్త ఓటర్లుగా చేర్చడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ఓటర్లందరి పేర్లు జాబితాలో ఉండేలా చూడాలని, ఇందుకోసం బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని పార్టీ కార్యకర్తలకు సీఎం సూచించారు.

బాధ్యత వాళ్లదే..

ఈ అంశంపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా హిందువుల ఓట్లు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యతను ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యవర్గ సభ్యులకు అప్పగించారు. కాగా, ఎస్ఎస్ఆర్ ప్రక్రియ తర్వాత ఉత్తరప్రదేశ్ ఓటర్ల జాబితా నుంచి వివిధ కారణాలతో 2.04 కోట్ల మంది పేర్లను ఎన్నికల అధికారులు తొలగించారు. ఈ తొలగింపులు ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా జరిగాయి. ముఖ్యంగా మహిళా ఓటర్లు తీవ్రంగా ప్రభావితమయ్యారు. అయితే, భారత ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం 84 లక్షలకు పైగా కొత్త ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చారు. దీంతో యూపీలో తుది ఓటర్ల సంఖ్య 13,39,84,792కు చేరింది. అయితే, ఓటర్ల జాబితా నుంచి హిందువుల పేర్లు తొలగించారంటూ యోగి ఆదిత్యనాథ్ ఆరోపించడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ హిందువుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని పలుమార్లు బీజేపీ కార్యకర్తలకు ఆయన సూచించారు.

కాంగ్రెస్ లక్ష్యం ప్రభుత్వాన్ని కూల్చడమే!

- 'మాక్ పార్లమెంట్' వ్యవహారంపై బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర ఫైర్
- రాహుల్‌ను 'మాక్ ప్రైమ్ మినిస్టర్' చేయాలంటూ సెటైర్లు
- బంగ్లాదేశ్ తరహా అల్లర్లు సృష్టించే కుట్ర జరుగుతోందని ఆరోపణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : ఇండి కూటమి నిర్వహించిన 'మాక్ పార్లమెంట్'పై భారతీయ జనతా పార్టీ నాయకులు సెటైర్లు వేస్తున్నారు. ఆ మాక్ పార్లమెంట్‌లో రాహుల్ గాంధీని మాక్ ప్రైమ్ మినిస్టర్ చేయాలంటూ బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర ఎద్దేవా చేశారు. ఆ తరువాత రాహుల్ చుట్టూ కాంగ్రెస్ నేతలు చేరి భజన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన చురకలంటించారు. ఎన్నికల ప్రక్రియ స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)లో అవకతవకలు జరిగాయంటూ ఇండి కూటమి నిరసనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఆ కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసనలో భాగంగా ఈరోజు మాక్ పార్లమెంట్ నిర్వహించి, సీఈసీపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు.

ఈ నేపథ్యంలో ఎంపీ సంబిత్ పాత్ర కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో బీజేపీపై గెలిచి అధికారంలోకి రాలేని రాహుల్.. ఆందోళనలతో రావాలని అనుకుంటున్నారని సంబిత్ విమర్శించారు. 'కాంగ్రెస్ నిరసనలు చేస్తోంది దేశం కోసమూ కాదు, విద్యార్థుల కోసమూ కాదు. కేవలం అధికారం కోసమే ఆ పార్టీ నిరసనలు చేస్తోంది. ప్రభుత్వాన్ని కూల్చటమే కాంగ్రెస్ నేతల లక్ష్యం. గతంలో బంగ్లాదేశ్‌లో జరిగిన అల్లర్ల వంటి ఘటనలు ఇక్కడా సృష్టించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు' అంటూ ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

పంజాబ్‌లో 'ఆప్' కసరత్తు షురూ!

2027 అసెంబ్లీ ఎన్నికల కోసం 40 మందితో తొలి జాబితా

ధురి నుంచే మరోసారి సీఎం భగవంత్ మాన్ పోటీ

జైలులో ఉన్న మంత్రి సంజీవ్ అరోరాకూ చోటు

చండీగఢ్, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఇప్పట్నుంచే కసరత్తు ప్రారంభించింది. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోయే 40 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ప్రకటించింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మరోసారి ధురి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్‌కు కోట్‌కపురా టికెట్ కేటాయించారు. ఎన్నికలకు ఇంకా కొన్ని నెలల సమయం ఉండగానే అభ్యర్థులను ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో శుక్రవారం పార్టీ ముఖ్య నేతలు సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్, పార్టీ పంజాబ్ ఇన్‌ఛార్జి మనీశ్ సిసోడియా తదితరులు పాల్గొన్నారు. అభ్యర్థుల ఎంపికపై చర్చించిన అనంతరం రాజకీయ వ్యవహారాల కమిటీ ఆమోదంతో శనివారం తొలి జాబితాను విడుదల చేశారు. పంజాబ్‌లో మొత్తం 117 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. తొలి జాబితాలో 40 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. మిగిలిన స్థానాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగనుంది. తొలి జాబితాలో ముఖ్యమంత్రి, మంత్రులకు చోటు కల్పించారు. లూధియానా వెస్ట్ నుంచి పోటీ చేయనున్న మంత్రి సంజీవ్ అరోరా ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఆయనకు పార్టీ మరోసారి టికెట్ కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. పంజాబ్‌లో ప్రస్తుత అసెంబ్లీ గడువు 2027 మార్చి 16తో ముగియనుంది. ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో జరిగే అవకాశం ఉంది. అయితే ఎన్నికల సంఘం ఇంకా అధికారిక షెడ్యూల్ ప్రకటించలేదు.

పంజాబీలకు పోరాటం నేర్పకండి

వివాదాలకు ముగింపు పలికిన దిల్‌జిత్ దోసాంజ్

ఢిల్లీ కాన్సర్ట్ వేదికగా విమర్శకులకు పరోక్ష కౌంటర్

'చిన్న తమ్ముడిగా భావించి వదిలేయండి' అన్న అభిజీత్ దీప్కే

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : ఢిల్లీలోని జవాహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిన్న సాయంత్రం జరిగిన కాన్సర్ట్‌లో ప్రముఖ పంజాబీ గాయకుడు, నటుడు దిల్‌జిత్ దోసాంజ్ తన సంగీతంతో శ్రోతలను అలరించడంతో పాటు ఒక కీలకమైన సందేశాన్ని ఇచ్చారు. గతంలో తనపై వచ్చిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన పరోక్షంగా స్పందించారు. నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్ లైవ్ సెషన్‌లో, ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనపై దిల్‌జిత్ దోసాంజ్ స్పందిస్తూ.. 'నన్ను ఇలాంటి నిరసనలకు దూరంగా ఉంచండి. నేను ఒక కళాకారుడిని మాత్రమే, రాజకీయనాయకుడిని కాను' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ దిల్‌జిత్‌ను విమర్శించారు. నిన్నటి కాన్సర్ట్ సందర్భంగా దిల్‌జిత్ ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకుండా పరోక్షంగా సమాధానమిచ్చారు. 'నేనొక కళాకారుడిని కాబట్టి మీ అందరినీ ప్రేమిస్తున్నాను. నేను మౌనంగా ఉన్నాను, నన్ను అలాగే ఉండనివ్వండి. నేను మీ అందరికీ మద్దతు ఇస్తున్నాను. పంజాబీలకు ఎలా పోరాడాలో నేర్పించకండి' అని అన్నారు. ఈ కాన్సర్ట్ చివరలో 'మై హూ పంజాబ్'.. 'ఐ యామ్ యాన్ ఆర్టిస్ట్' అనే లేజర్ ప్రదర్శనతో కార్యక్రమం ముగిసింది.

అభిజీత్ దీప్కే స్పందన..

దిల్‌జిత్ కాన్సర్ట్ వీడియో వైరల్ కావడంతో, సీజేపీ అధినేత అభిజీత్ దీప్కే ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ వివాదానికి ముగింపు పలకాలనే కోరికను వ్యక్తం చేశారు. 'చిన్న తమ్ముడిగా భావించి ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయండి' అని కోరారు. గతంలో దిల్‌జిత్ చేసిన వ్యాఖ్యలు తనకు కొంత బాధ కలిగించినప్పటికీ, కళాకారుడిగా ఆయనపై ఉన్న గౌరవం, అభిమానం ఎప్పటికీ తగ్గలేదని చెప్పారు. గత మే నెలలో చికాగోలో జరిగిన దిల్‌జిత్ కాన్సర్ట్‌కు కూడా తాను హాజరైనట్లు ఆయన గుర్తుచేశారు.



అర్ధశతాబ్దపు ప్రస్థానం

మహిళా క్రికెట్‌కు స్వర్ణోత్సవం!

- భారత మహిళల తొలి టెస్టుకు నేటితో 50 ఏళ్లు
- 1976 అక్టోబర్ 31న వెస్టిండీస్‌తో చారిత్రక అరంగేట్రం
- తొలి మ్యాచ్‌లోనే ఐదు వికెట్లతో మెరిసిన శుభాంగి కులకర్ణి
- అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి సిక్సర్ బాదిన శాంతా రంగస్వామి
- ఐదు దశాబ్దాల మహిళా క్రికెట్ ప్రయాణాన్ని గుర్తుచేసిన బీసీసీఐ
- మాజీ కెప్టెన్లకు ప్రత్యేక సత్కారం.. నాటి త్యాగాలకు ఘన నివాళి

బెంగళూరు, అక్టోబర్ 31 (సమయం న్యూస్): భారత మహిళల క్రికెట్ చరిత్రలో అక్టోబర్ 31కు ప్రత్యేక స్థానం ఉంది. సరిగ్గా 50 ఏళ్ల క్రితం ఇదే రోజు భారత మహిళల జట్టు అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో తొలి అడుగు వేసింది. 1976 అక్టోబర్ 31న బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో వెస్టిండీస్‌తో తొలి అధికారిక టెస్టు మ్యాచ్ ఆడింది. ఆ చారిత్రక ఘట్టానికి అర్ధశతాబ్దం పూర్తయిన సందర్భంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రత్యేకంగా స్పందించింది. సామాజిక మాధ్యమాల్లో మహిళల క్రికెట్ ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ ప్రత్యేక సందేశాన్ని పంచుకుంది. భారత మహిళల క్రికెట్ అభివృద్ధికి పునాదులు వేసిన మాజీ కెప్టెన్లను సత్కరించి వారి సేవలను కొనియాడింది. భారత మహిళల తొలి టెస్టులో 17 ఏళ్ల లెగ్ స్పిన్నర్ శుభాంగి కులకర్ణి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఐదు వికెట్లు పడగొట్టి వెస్టిండీస్‌ను 274 పరుగులకు పరిమితం చేయడంలో కీలక పాత్ర పోషించింది. తొలి అంతర్జాతీయ టెస్టులోనే భారత మహిళా బౌలర్ ఈ స్థాయిలో రాణించడం అప్పట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అదే మ్యాచ్‌లో భారత కెప్టెన్ శాంతా రంగస్వామి మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. వెస్టిండీస్ బౌలర్ ప్యాట్రిషియా విటేకర్ బౌలింగ్‌లో లాంగ్ ఆన్, మిడ్ వికెట్ మధ్య భారీ సిక్సర్ బాదింది. భారత మహిళల అధికారిక అంతర్జాతీయ క్రికెట్‌లో నమోదైన తొలి సిక్సర్‌గా అది చరిత్రలో నిలిచింది. భారత్ 269 పరుగులకు ఆరు వికెట్ల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి విజయానికి ప్రయత్నించింది. అయితే చివరి రోజు ఆట ఆలస్యంగా ప్రారంభం కావడంతో మూడు రోజుల టెస్టు డ్రాగా ముగిసింది. నేడు భారత మహిళల క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ వంటి స్టార్ క్రికెటర్లు కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. బీసీసీఐ ఒప్పందాలు, మహిళల ప్రీమియర్ లీగ్, వాణిజ్య ప్రకటనల ద్వారా మహిళా క్రికెటర్లకు ఆదాయ అవకాశాలు పెరిగాయి. అయితే ఈ స్థాయికి చేరుకోవడం వెనుక గత తరాల క్రీడాకారిణుల కృషి, త్యాగాలు ఎంతో ఉన్నాయి. సరైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక ప్రోత్సాహం, ప్రజాదరణ పరిమితంగా ఉన్న రోజుల్లోనూ మహిళా క్రికెటర్లు పట్టుదలతో ముందుకు సాగారు. వారి పోరాటమే నేటి తరానికి బలమైన పునాదిగా నిలిచింది. క్రికెట్‌కు పుట్టిల్లుగా పేరొందిన లార్డ్స్ మైదానంలో మహిళల టెస్టు క్రికెట్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. పురుషుల తొలి టెస్టు జరిగిన అనేక దశాబ్దాల తర్వాత ఈ ప్రతిష్ఠాత్మక మైదానంలో మహిళల టెస్టుకు అవకాశం దక్కింది. ఇంగ్లండ్‌తో జరిగిన పోరులో భారత మహిళల జట్టు 270 పరుగుల తేడాతో విజయం సాధించడం మరో చారిత్రక ఘట్టంగా నిలిచింది. ఈ విజయం మహిళల క్రికెట్ ఎదుగుదలను అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పింది. ఐదు దశాబ్దాల క్రితం పరిమిత అవకాశాల మధ్య ప్రారంభమైన భారత మహిళల టెస్టు ప్రయాణం నేడు కొత్త శిఖరాలకు చేరుకుంది. తొలి తరం క్రీడాకారిణులు వేసిన పునాదులపై నేటి తరం ప్రపంచ క్రికెట్‌లో సత్తా చాటుతోంది. మహిళల క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణ, అవకాశాలు, పెట్టుబడులు ఈ ప్రయాణంలో కీలక మైలురాళ్లుగా నిలుస్తున్నాయి. 1976లో బెంగళూరు మైదానంలో పడిన తొలి అడుగు.. నేడు కోట్లాది మంది అమ్మాయిల కలలకు స్ఫూర్తిగా మారింది. భారత మహిళల క్రికెట్‌కు 50 ఏళ్లు పూర్తవడం కేవలం ఒక వార్షికోత్సవం కాదు.. ఐదు దశాబ్దాల పట్టుదల, పోరాటం, విజయాలకు నిలువెత్తు నిదర్శనం!

మనీషా పసిడి పట్టు.. చరిత్రలో సరికొత్త అధ్యాయం!

- ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళ తొలి స్వర్ణం
- 59 కిలోల విభాగంలో విశ్వవిజేతగా మనీషా భన్వాలా
- ఫైనల్‌లో అమెరికా రెజ్లర్ అబిగెల్ నెట్టెపై 8--6తో విజయం
- 0-6తో వెనుకబడినా అద్భుతంగా పుంజుకున్న భారత రెజ్లర్
- సుశీల్ కుమార్ తర్వాత ప్రపంచ స్వర్ణం సాధించిన రెండో భారత రెజ్లర్
- కాజల్, నీలమ్‌కు రజతాలు.. రెజ్లింగ్‌లో భారత మహిళల సత్తా

ఆస్తానా, అక్టోబర్ 31 (సమయం న్యూస్): ప్రపంచ రెజ్లింగ్ వేదికపై భారత మహిళా క్రీడాకారిణి మనీషా భన్వాలా చరిత్ర సృష్టించింది. ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల 59 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించి భారత కీర్తిపతాకాన్ని రెపరెపలాడించింది. శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో అమెరికాకు చెందిన అబిగెల్ నెట్టెను 8–6 పాయింట్ల తేడాతో ఓడించి విశ్వవిజేతగా అవతరించింది. తద్వారా ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో స్వర్ణం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ తరఫున స్వర్ణం గెలిచిన రెండో రెజ్లర్‌గా కూడా మనీషా నిలిచింది. అంతకుముందు 2010లో సుశీల్ కుమార్ పురుషుల 66 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. మనీషా స్వర్ణ పోరు ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. ఫైనల్ ప్రారంభంలో అమెరికా రెజ్లర్ అబిగెల్ నెట్టె ఆధిపత్యం ప్రదర్శించింది. వరుస పాయింట్లు సాధించి 6–0తో ముందంజ వేసింది. దీంతో మనీషా ఓటమి తప్పదేమోనన్న పరిస్థితి ఏర్పడింది. అయితే విరామం తర్వాత భారత రెజ్లర్ అద్భుతంగా పుంజుకుంది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా తన పట్టుతో ఉక్కిరిబిక్కిరి చేసింది. వరుసగా పాయింట్లు సాధిస్తూ ఆధిక్యాన్ని తగ్గించుకోవడమే కాకుండా చివరకు 8–6తో విజయాన్ని అందుకుంది. ఆరు పాయింట్లు వెనుకబడిన స్థితి నుంచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న మనీషా పోరాటపటిమ అందరినీ ఆకట్టుకుంది. ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు పతకాలు సాధించినప్పటికీ స్వర్ణ పతకం మాత్రం అరుదుగానే దక్కింది. 2010లో సుశీల్ కుమార్ సాధించిన చారిత్రక విజయం తర్వాత మరోసారి భారత రెజ్లింగ్‌కు ప్రపంచ స్వర్ణం అందించిన ఘనత మనీషాకు దక్కింది. అంతేకాకుండా మహిళల విభాగంలో ఈ ఘనత సాధించిన తొలి భారత రెజ్లర్‌గా ఆమె పేరు చరిత్రలో నిలిచిపోయింది. తాజా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా రెజ్లర్లు అద్భుత ప్రతిభ కనబరిచారు. మనీషాతోపాటు కాజల్, నీలమ్ కూడా తమ విభాగాల్లో ఫైనల్‌కు చేరుకున్నారు. అయితే తుది పోరులో ఓటమి ఎదురవడంతో వారిద్దరూ రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. మనీషా మాత్రం ఆఖరి వరకు పోరాడి స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకుంది. ప్రపంచస్థాయి పోటీల్లో భారత మహిళా రెజ్లర్లు వరుసగా పతకాలు సాధించడం దేశ రెజ్లింగ్ భవిష్యత్తుపై ఆశలు పెంచుతోంది. ముఖ్యంగా మనీషా సాధించిన చారిత్రక విజయం యువ క్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలవనుంది. ఒత్తిడిలోనూ పట్టుదల కోల్పోకుండా చివరి వరకు పోరాడితే విజయం సాధించవచ్చని ఆమె నిరూపించింది. ఆరు పాయింట్లు వెనుకబడినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పోరాడిన మనీషా.. చివరకు ప్రపంచ స్వర్ణాన్ని తన పట్టులో బంధించింది. భారత మహిళా రెజ్లింగ్ చరిత్రలో ఆమె విజయం చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోనుంది.

సెమీస్‌లో సింధు జోరు.. లక్ష్య, అన్మోల్ హోరు!

హైలో ఓపెన్ బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్ల సత్తా

సార్‌బ్రూకెన్ (జర్మనీ), అక్టోబర్ 31 (సమయం న్యూస్): హైలో ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు అదరగొడుతున్నారు. స్టార్ క్రీడాకారిణి పీవీ సింధుతోపాటు యువ సంచలనం అన్మోల్ ఖర్బ్, పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీల్లో ముగ్గురూ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా సింధు కేవలం 27 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తుచేయగా, అన్మోల్, లక్ష్య సేన్ మూడు గేమ్‌ల పోరులో విజయాలు సాధించారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో పీవీ సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఆతిథ్య జర్మనీకి చెందిన అమేలీ షఙ్‌ను 21–12, 21–10 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించింది. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన సింధు ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. పదునైన స్మాష్‌లు, చక్కటి కోర్టు కవరేజీతో పాయింట్లు సాధిస్తూ మ్యాచ్‌ను కేవలం 27 నిమిషాల్లో ముగించింది. ఈ విజయంతో టైటిల్‌కు మరో రెండు అడుగుల దూరంలో నిలిచింది. మరో మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో భారత యువ షట్లర్ అన్మోల్ ఖర్బ్ ఉత్కంఠభరిత విజయాన్ని అందుకుంది. భారత క్రీడాకారిణి ఉన్నతి హుడాతో జరిగిన పోరులో 21–17, 18–21, 21–16తో విజయం సాధించింది. తొలి గేమ్‌ను గెలుచుకున్న అన్మోల్ రెండో గేమ్‌ను కోల్పోయినా నిర్ణయాత్మక మూడో గేమ్‌లో పుంజుకుంది. కీలక సమయంలో వరుస పాయింట్లు సాధించి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. దీంతో సెమీఫైనల్‌లో సింధుతో తలపడేందుకు సిద్ధమైంది. ఇద్దరు భారత క్రీడాకారిణుల మధ్య జరగనున్న ఈ పోరుతో మహిళల సింగిల్స్‌లో భారత్‌కు ఫైనల్ స్థానం ఖాయమైంది. పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ కూడా సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఫిన్లాండ్‌కు చెందిన కాల్ కొజోనెన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో 14–21, 21–17, 21–13తో విజయం సాధించాడు. తొలి గేమ్‌లో ప్రత్యర్థి ఆధిపత్యానికి తలొగ్గిన లక్ష్య రెండో గేమ్ నుంచి ఆటతీరును మార్చుకున్నాడు. దూకుడైన స్మాష్‌లు, మెరుగైన రక్షణాత్మక ఆటతో పుంజుకుని రెండో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ అదే జోరు కొనసాగించి సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నాడు. ఒకే టోర్నమెంట్‌లో ముగ్గురు భారత షట్లర్లు సెమీఫైనల్‌కు చేరుకోవడంతో టైటిల్‌పై ఆశలు పెరిగాయి. మహిళల సింగిల్స్‌లో సింధు, అన్మోల్ మధ్య జరిగే పోరు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ కూడా ఫైనల్‌కు చేరాలనే పట్టుదలతో ఉన్నాడు. సింధు అనుభవం.. అన్మోల్ యువ దూకుడు.. లక్ష్య సేన్ పోరాటపటిమతో హైలో ఓపెన్‌లో భారత బ్యాడ్మింటన్ సందడి కొనసాగుతోంది.



పాక్ విజయానికి వారం సెలవు ఇవ్వాల్సిందే

ప్రధాని షహబాజ్ షరీఫ్‌పై ట్రోల్స్ వర్షం!

హాంకాంగ్, అక్టోబర్ 31 (సమయం న్యూస్): పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌పై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో ట్రోల్స్ వర్షం కురిపిస్తున్నారు. ఒక చిన్న క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్‌పై పాకిస్థాన్ సాధించిన సాధారణ విజయానికి ఆయన స్పందించిన తీరే ఇందుకు ప్రధాన కారణమైంది. ప్రధాని చూపించిన అత్యుత్సాహం చూసి నెటిజన్లు తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యారు. హాంకాంగ్ సిక్సెస్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య లీగ్ మ్యాచ్ జరిగింది. ఈ పోటీలో పాకిస్థాన్ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అనధికారిక హోదా ఉన్న ఈ చిన్న టోర్నమెంట్ గ్రూప్ మ్యాచ్‌లో తమ జట్టు సాధించిన విజయానికి ప్రధాని షరీఫ్ అమితానందంతో ఉప్పొంగిపోయారు. అత్యంత ఉత్సాహంతో తమ జట్టు సభ్యులను ఆకాశానికెత్తుతూ ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. “భారత్‌పై అద్భుతమైన విజయాన్ని అందుకున్న మన కుర్రాళ్లకు హృదయపూర్వక అభినందనలు. అదొక అత్యుత్తమమైన మ్యాచ్. మన క్రీడాకారులకు నిరంతరం మద్దతు ఇవ్వడంలో అంకితభావంతో పనిచేసిన పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ, ఆయన బృందానికి నా ప్రత్యేక అభినందనలు” అంటూ ప్రధాని పొగడ్తల వర్షం కురిపించారు. ప్రధాని చేసిన ఈ సుదీర్ఘ అభినందన పోస్టు క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై క్రీడాభిమానులు, నెటిజన్లు తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. అదొక గల్లీ క్రికెట్ లాంటి వినోదాత్మక టోర్నమెంట్ అని, దానికి దేశ ప్రధాని స్థాయిలో అంత బిల్డప్ ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. హాంకాంగ్ సిక్సెస్‌పై స్వయంగా ప్రధాని పోస్టు చేయడం తీవ్ర హాస్యాస్పదంగా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. ఏదో ఆసియా కప్ లేదా ప్రపంచకప్‌ను మించిన మహా టోర్నీలో భారత్‌పై పాకిస్థాన్ విజయం సాధించినంతగా సంబరపడిపోతున్నారంటూ సెటైర్లు వేస్తున్నారు. ఈ చారిత్రాత్మక ఘన విజయానికి పాకిస్థాన్ ప్రజలకు కచ్చితంగా వారం రోజుల పాటు జాతీయ సెలవు ప్రకటించాల్సిందేనంటూ నెటిజన్లు విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు.

ఇలాగైతే కష్టమేనబ్బా ‘సర్పంచ్ సాబ్’

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రదర్శనపై విమర్శలు!

ఆక్లాండ్, అక్టోబర్ 31 (సమయం న్యూస్): మొత్తం పాతిక మ్యాచ్‌లు.. అందులో 14 విజయాలు.. తొమ్మిది ఓటములు.. అరే.. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ప్రోగ్రెస్ కార్డ్ బానే ఉంది కదా ఇంకేంటి సమస్య? అనే ప్రశ్నలు తలెత్తడం సహజమే. కానీ, న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో టీ20లో ఘోర ఓటమితో పాటు బ్యాటర్‌గానూ విఫలం కావడంతో అతడిపై విమర్శకుల దృష్టి పడింది. కివీస్‌తో వరుసగా మూడు మ్యాచుల్లో టీమ్‌ఇండియా విజయం సాధించినప్పటికీ.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటర్‌గా పరుగులు చేయకపోయినా జట్టు గెలిచిందిగా అని అభిమానులు సరిపెట్టుకున్నారు. కానీ, నాలుగో టీ20లో 87 పరుగుల తేడాతో భారీ ఓటమి ఎదురైంది. సారథి శ్రేయస్ 11 బంతుల్లో 22 పరుగులు చేసి కీలక సమయంలో పెవిలియన్‌కు చేరాడు. 260 పరుగుల లక్ష్య ఛేదనకు దిగినప్పుడు బాధ్యతాయుతంగా ఆడాల్సిన అవసరం ఉండగా, శ్రేయస్ 200 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేసినప్పటికీ అది సరిపోలేదు. మిగతా బ్యాటర్లతో కలిసి భాగస్వామ్యాలను నిర్మించాల్సింది పోయి తేలికగా వికెట్ ఇచ్చేశాడు. ఇప్పటి వరకు ఈ సిరీస్‌లో అతడు ఆడిన నాలుగు మ్యాచుల్లో చేసిన పరుగులు కేవలం 76 మాత్రమే కావడం గమనార్హం. సూర్య కుమార్ బాటలోనే శ్రేయస్ పయనిస్తున్నారనే చర్చ జరుగుతోంది. సిరీస్‌లు, ట్రోఫీలు గెలిచినా సరే వ్యక్తిగత ఆట కూడా మెరుగ్గా ఉండాలని, లేకపోతే సూర్యకుమార్ యాదవ్ పరిస్థితే శ్రేయస్‌కూ తలెత్తే ప్రమాదం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. సూర్య నాయకత్వంలో టీమ్‌ఇండియా వరల్డ్ కప్‌నూ నెగ్గినా, వ్యక్తిగతంగా బ్యాటింగ్‌లో రాణించకపోవడంతో ప్రస్తుతం జట్టులో స్థానం కోల్పోవాల్సి వచ్చింది. ఇటు శ్రేయస్ కూడా 25 మ్యాచుల్లో 666 పరుగులు రాబట్టినప్పటికీ, స్ట్రైక్‌రేట్ 147.7 మాత్రమే ఉంది. 2028 టీ20 ప్రపంచ కప్‌లో జట్టుకు నాయకత్వం వహించాలని అనుకుంటే మాత్రం తన బ్యాటింగ్‌కూ పదను పెట్టాల్సిందే. సిరీస్‌ను భారత్ ఇప్పటికే సొంతం చేసుకున్నప్పటికీ శ్రేయస్ కెప్టెన్సీపై విమర్శలు రావడానికి మరో ప్రధాన కారణం బౌలింగ్ మార్పులు. అతడు సారథ్యం చేపట్టాకే టీమ్‌ఇండియా భారీ తేడాతో ఓటములను చవిచూసింది. ఇంతకుముందు ఇంగ్లాండ్ చేతిలో 125 పరుగుల తేడాతో పరాజయం పాలవగా, ఇప్పుడు 87 రన్స్‌తో ఓడింది. ఈ రెండు మ్యాచ్‌లకూ శ్రేయసే కెప్టెన్. ఇక న్యూజిలాండ్ సిరీస్‌లోనూ అతడి నిర్ణయాలపై మాజీ క్రికెటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. బౌలర్లకు కష్టకాలం నడుస్తున్న వేళ వారిని వినియోగించుకోవడంలో అయ్యర్ ఇబ్బంది పడినట్లు మహ్మద్ కైఫ్ వ్యాఖ్యానించాడు. ప్రధాన బౌలర్లను సరిగ్గా ఉపయోగించాలనే కనీస ఫార్ములాను శ్రేయస్ పక్కన పెట్టాడని అభిప్రాయపడ్డాడు. ఇకనైనా ఇలాంటి తప్పుల నుంచి శ్రేయస్ నేర్చుకుంటేనే సుదీర్ఘకాలం జట్టుకు నాయకత్వం వహించే అవకాశాలు ఉంటాయి.

సమంతకు కవల పిల్లలా..

కృతి కర్బందా కామెంట్‌తో మొదలైన కొత్త చర్చ!

హైదరాబాద్, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంతో పాటు సినిమాల విషయంలోనూ నిరంతరం వార్తల్లో నిలుస్తున్నారు. ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే సమంత, ఎంత బిజీగా ఉన్నప్పటికీ వ్యాయామం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. తాజాగా తన వర్కౌట్ ప్రయాణానికి సంబంధించిన ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అది వైరల్‌గా మారింది. అయితే ఈ వీడియో కంటే హీరోయిన్ కృతి కర్బందా చేసిన ఒక చిన్న కామెంట్ ఇప్పుడు నెట్టింట పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. సమంత తాజాగా తన వ్యాయామ ప్రయాణానికి సంబంధించిన వీడియోను అభిమానులతో పంచుకుంటూ, మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు సాగిన వర్కౌట్ దృశ్యాలను అందులో చూపించారు. ఈ వీడియోకు 'ది ఫైనల్ ల్యాప్' అంటూ సమంత ఆసక్తికరమైన క్యాప్షన్ జోడించారు. దీంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలియజేస్తూ కామెంట్లు చేస్తున్నారు. అయితే ఈ పోస్టుపై హీరోయిన్ కృతి కర్బందా స్పందిస్తూ.. 'సెండింగ్ ఆల్ 3 ఆఫ్ యూ సో మచ్ లవ్' (మీ ముగ్గురికీ ఎంతో ప్రేమను పంపిస్తున్నాను) అంటూ కామెంట్ చేశారు. దీంతో ఈ ముగ్గురు ఎవరు, కృతి అలా ఎందుకు కామెంట్ చేశారు అంటూ నెటిజన్లు ఆరా తీయడం మొదలుపెట్టారు. కృతి కర్బందా చేసిన కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు కారణమైంది. కొందరు సమంత, ఆమె భర్త, పుట్టబోయే బిడ్డను ఉద్దేశించే కృతి అలా కామెంట్ చేసి ఉంటారని భావిస్తుండగా, మరికొందరు మాత్రం సమంతకు కవల పిల్లలు పుట్టబోతున్నారనే సంకేతమా అంటూ ఊహాగానాలు చేస్తున్నారు. అయితే కృతి కర్బందా తన కామెంట్‌లో అసలు ఎవరిని ఉద్దేశించారనే విషయంపై ఎలాంటి స్పష్టత లేదు. ఆమె సరదాగా చేసిన వ్యాఖ్యకు నెటిజన్లు రకరకాల అర్థాలు తీస్తున్నారు. దీంతో సమంతకు కవల పిల్లలు పుట్టబోతున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది తెలియాల్సి ఉంది. దీనిపై సమంత కానీ, కృతి కానీ ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఇక సమంత సినిమాల విషయానికి వస్తే, ఆమె చివరిగా 'మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మరోవైపు పవన్ కల్యాణ్ నటించిన 'తీన్ మార్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన కృతి కర్బందా ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు.

నా మనసంతా హైదరాబాద్‌లోనే ఉంది

రకుల్ ప్రీత్ సింగ్ ఎమోషనల్ వ్యాఖ్యలు!

హైదరాబాద్, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : టాలీవుడ్ సినిమాలతో స్టార్ హీరోయిన్‌గా అపారమైన గుర్తింపు తెచ్చుకుని, ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు పాన్-ఇండియా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ భాగ్యనగరంపై తనకున్న ప్రేమను మరోసారి చాటుకుంది. కెరీర్‌లో ఎక్కడికి వెళ్లినా, ఎన్ని భాషల్లో సినిమాలు చేసినా తన మనసంతా ఎప్పుడూ హైదరాబాద్‌లోనే ఉంటుందని తన మనసులోని మాటను బయటపెట్టింది. నితీష్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, రాకింగ్ స్టార్ యష్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ విజువల్ వండర్ 'రామాయణ' సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం నిర్వహించిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో రకుల్ ప్రీత్ సింగ్ పాల్గొంది. ఈ ఇంటర్వ్యూ ప్రారంభంలో యాంకర్ రకుల్‌ను ఆప్యాయంగా పలకరిస్తూ.. "వెల్‌కమ్ రకుల్.. నువ్వు హైదరాబాద్ అమ్మాయివే కదా!" అని అనగానే, రకుల్ ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే స్పందించింది. "నిజమే.. నా హృదయం ఎప్పుడూ హైదరాబాద్‌లోనే ఉంటుంది" అంటూ నవ్వుతూ బదులిచ్చింది. తెలుగు చిత్ర పరిశ్రమ ద్వారానే తనకు స్టార్‌డమ్ వచ్చిందని, ఇక్కడి ప్రేక్షకులు చూపించిన అపారమైన ప్రేమాభిమానాలే తనను ఈ స్థాయికి చేర్చాయని తెలిపింది. ఇదే విషయాన్ని గతంలోనూ పలు సందర్భాల్లో రకుల్ గుర్తుచేసుకుంది. ప్రస్తుతం ఏకంగా గ్లోబల్ ప్రాజెక్ట్ 'రామాయణ' ప్రమోషన్లలో పాల్గొంటూ, హైదరాబాద్ వేదికగా ఆమె చేసిన ఈ కామెంట్స్ తెలుగు ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తెలుగులో మరిన్ని మంచి చిత్రాలు చేయాలని ఉందనే ఆకాంక్షను కూడా ఈ సందర్భంగా ఆమె వ్యక్తం చేసింది. ప్రస్తుతం రకుల్ చెప్పిన ఈ మాటలు సోషల్ మీడియాలో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటూ తెగ వైరల్ అవుతున్నాయి.

'రంగస్థలం' తర్వాత మరో సంచలనం..

చరణ్-సుకుమార్ సిద్ధం!

నేడు భారీ చిత్రానికి ప్రారంభోత్సవం.. మెగా అభిమానుల్లో ఉత్సాహం

హైదరాబాద్, అక్టోబర్ 31 (సమయం న్యూస్): మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, ప్రముఖ దర్శకుడు సుకుమార్ కలయికలో మరో భారీ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమవుతోంది. తెలుగు సినీ పరిశ్రమలో సంచలన విజయం సాధించిన 'రంగస్థలం' తర్వాత వీరిద్దరూ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నవంబర్ 1న సినిమా ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో దర్శకుడు సుకుమార్ భార్య తబితా సుకుమార్ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఆసక్తికర సందేశం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ సినిమా కోసం తన భర్త పడిన కష్టాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె భావోద్వేగంగా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తబితా సుకుమార్ ఈ కొత్త ప్రాజెక్టుపై ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. సుకుమార్ భార్యగా ఈ చిత్రం తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కథను సిద్ధం చేయడానికి సుకుమార్ ఎంత సమయం వెచ్చించారో, ఎన్ని గంటలు శ్రమించారో తనకు తెలుసని తెలిపారు. రచనపై ఆయనకున్న అభిరుచి, అంకితభావం, పట్టుదల ఇప్పుడు ఒక రూపం దాల్చబోతుండటం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని వివరించారు. ఆయన కష్టానికి తెరపై ప్రతిఫలం దక్కబోతున్న క్షణాలను చూడటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రామ్ చరణ్, సుకుమార్ కలయిక అనగానే సినీ అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చేది 'రంగస్థలం'. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ చిత్రంలో రామ్ చరణ్‌ను సుకుమార్ పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించారు. చిట్టిబాబు పాత్రలో చరణ్ నటనకు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. కథ, కథనం, పాత్రల రూపకల్పనతో 'రంగస్థలం' తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇప్పుడు అదే కలయిక మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈసారి ఎలాంటి కథను ఎంచుకున్నారనే ఆసక్తి నెలకొంది. కొత్త చిత్రానికి సంబంధించిన కథ, రామ్ చరణ్ పాత్ర, ఇతర నటీనటుల ఎంపికపై ఇప్పటికే పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే చిత్ర బృందం నుంచి అధికారిక





వివరాలు వెల్లడయ్యే వరకు వీటిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. తాజాగా తబితా చేసిన వ్యాఖ్యలతో కథ కోసం సుకుమార్ ప్రత్యేకంగా శ్రమించారనే విషయం అభిమానుల్లో చర్చనీయాంశమైంది. దీంతో చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ భారీ చిత్రం నవంబర్ 1న ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రారంభోత్సవ కార్యక్రమంలో చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశముంది. ముఖ్యంగా కథా నేపథ్యం, రామ్ చరణ్ పాత్ర స్వభావం, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రాజకీయాల వల్లే ప్రకాశ్‌రాజ్‌ని సినిమాల నుంచి తొలగించారు

భార్య పోని వర్మ సంచలన వ్యాఖ్యలు!

హైదరాబాద్, అక్టోబర్ 31 (సమయం న్యూస్) : ప్రముఖ బహుభాషా నటుడు ప్రకాశ్‌రాజ్ తన రాజకీయ, సామాజిక అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరచడం వల్ల ఆయన సినీ కెరీర్‌పై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడిందని భార్య, ప్రముఖ కొరియోగ్రాఫర్ పోనీ వర్మ తాజాగా వెల్లడించారు. దేశంలో జరిగే పలు సామాజిక పరిణామాలు, ప్రభుత్వ విధానాలపై ప్రకాశ్‌రాజ్ నిరంతరం ముందుండి ప్రశ్నలు సంధిస్తుంటారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా 'జస్ట్ ఆస్కింగ్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఆయన చేసే పోస్టులు నిత్యం తీవ్ర చర్చనీయాంశం అవుతుంటాయి. అయితే ఈ విధంగా తన మనసులోని మాటను

కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం వల్లే ఆయన ఎన్నో అద్భుతమైన అవకాశాలను కోల్పోవాల్సి వచ్చిందని పోనీ వర్మ పేర్కొన్నారు. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పోనీ వర్మ ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మొదట్లో ప్రకాశ్‌రాజ్ రాజకీయాలపై మాట్లాడే విధానం తనను ఎంతో భయపెట్టేదని ఆమె గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా ప్రముఖ జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య ఘటన ప్రకాశ్‌రాజ్‌ను మానసికంగా తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఆ దురదృష్టకర సంఘటన తర్వాతే ఆయన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని, ఇలా సమాజంలో భయపడుతూ బతకడం ఎందుకు అని ఆయన ప్రశ్నించుకున్నారని చెప్పారు. ఆ క్షణం నుంచే సామాజిక మాధ్యమాల ద్వారా సమాజంలో జరుగుతున్న తప్పులను నిరంతరం ప్రశ్నించడం మొదలుపెట్టారని ఆమె వివరించారు. అయితే ఈ సామాజిక స్పృహ ఆయన సినీ కెరీర్‌కు మాత్రం భారీ మూల్యాన్నే తెచ్చిపెట్టిందని పోనీ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన బహిరంగంగా గళం విప్పడం వల్ల పలు సినిమా అవకాశాలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు, వాణిజ్య ప్రకటనల ప్రాజెక్టులు చేజారిపోయాయని చెప్పారు. కొందరు దర్శక-నిర్మాతలు ఆయనకు ఇప్పటికే అడ్వాన్స్‌లు కూడా చెల్లించారని, కానీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆ తర్వాత ప్రాజెక్టుల నుంచి ఆయనను తొలగించిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆమె సంచలన నిజాలను వెల్లడించారు. వృత్తిపరంగా ఆయన ఎంతో నష్టపోయినప్పటికీ, ప్రకాశ్‌రాజ్ మాత్రం తన సిద్ధాంతాల నుంచి ఎప్పుడూ వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. తన మనస్సాక్షికి ఏది తప్పుగా అనిపిస్తుందో దానిని ఎప్పటికీ అంగీకరించకూడదని ఆయన గట్టి నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఆర్థికంగా, కెరీర్ పరంగా ఎన్నో నష్టాలు ఎదురైనా తన నమ్మకాల కోసం ఆయన రాజీపడకుండా ముందుకు సాగుతున్నారని తెలిపింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**